

విశాఖే ఆర్థిక రాజధాని

జిల్లా దశ, దిశ మారుద్దాం

- అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం
- ఇక్కడి ప్రజల మద్దతు ఎప్పుడూ టీడీపీకే



ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

విశాఖపట్నం,అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రానికి ఆర్థిక రాజధాని విశాఖపట్నమేనని, దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు వీలుగా పక్కాప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ దిశా నిర్దేశం చేశారు. భవిష్యత్తులో చోటుచేసుకునే మార్పులు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని విశాఖపట్నం దశ, దిశ మార్చేలా ప్రణాళికలు ఉండాలన్నారు. రానున్న ఐదేళ్లలో ఏటీ రంగంలో యువతకు 5 లక్షల ఉద్యోగాలను కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు నాలుగు జిల్లాలు, అరకు, పాడేరుతో కలిపి గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్ అభివృద్ధి, ఇతర అంశాలపై ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

- ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్



మంత్రి లోకేశ్‌కు వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్న



సిఫీ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బెంగళూరు, పుణే లాంటి నగరాల్లో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు విశాఖలో ఉత్పన్నం కాకుండా చూడాలని, విశాలంగా రోడ్లు అభివృద్ధి చేయాలని సూచించారు. విశాఖ వేదికగా అనేక కంపెనీలు వస్తున్నాయని, రానున్న 30 సంవత్సరాలకు తగ్గట్టుగా మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయంతో కూడిన మేథోపరమైన చర్చ జరగాలన్నారు. అనేక కంపెనీలు, అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకాబోతున్నాయని, దీంతో ఈ రీజియన్‌లోని యువతకు ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సరైన విధంగా ఆలోచించి ప్రణాళికలు తయారుచేయాలని నిర్దేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేని విధంగా మిషన్ మోడ్‌లో అభివృద్ధి జరగాలని, వారికి ఆమోదయోగ్యమైన విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో విశాఖ రీజియన్‌లో ఐటీ పార్కుల ఏర్పాటుకు అనువుగా ల్యాండ్‌బ్యాంకు సిద్ధంచేయాలని ఆదేశించారు.

టీడీపీకే ప్రజా మద్దతు

అంతకుముందు రుషికొండలో సిఫీ ఎడ్జ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి లోకేశ్ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విశాఖ వాసులు ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీకి పట్టం కడుతున్నారని, వారి పూర్తి మద్దతు టీడీపీకేనని అన్నారు. హుద్‌హుద్ సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబులు నగరానికి వస్తే, అంతటి విపత్కర పరిస్థితుల్లోనూ వారికి చిరునవ్వుతో స్వాగతం పలికిన గొప్ప మనసున్న ప్రజలని ప్రశంసించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలోని అనేక చోట్ల టీడీపీ నేతలు ఓడిపోతే విశాఖలో టీడీపీకి పట్టం

... మిగతా 6వ పేజీలో

ప్రతికా, స్మృతి పోరు వృథా!

భారీ టార్గెట్‌ను ఛేదించిన ఆస్ట్రేలియా

సెంచరీతో కదంతొక్కిన అలిస్సా హీలి

- భారత్‌కు మరోసారి నిరాశ
- ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో పరుగుల వరద
- క్రికెట్ అభిమానులకు ఫుల్ జోష్

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):

సిక్సర్లు, బౌండరీలతో పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం హోరెత్తింది. భారత్ మహిళా బ్యాటర్లు పసందైన క్రికెట్ మజానందించినా ప్రేక్షకులకు గెలుపు ఆనందం దక్కలేదు. భారత ఓపెనర్లు ప్రతికా రావల్, స్మృతి మందాన సొగసైన షాట్‌లతో ప్రేక్షకులకు కనువిందు చేసినా ఫలితం లేకపోయింది. భారీ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా మహిళలు సునాయాసంగా ఛేదించి భారత్‌కు ఝలక్ ఇచ్చారు.

మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. భారత్ ఇన్నింగ్ ఆద్యంతం స్టేడియం కరతాళ ధ్వనులతో మర్మోగగా, దీటైన బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఆద్యంతం నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో అనూహ్య ఓటమితో పాఠాలు నేర్చుకున్న భారత్ మహిళలు ఆ సారి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచి కంగారూలను బెంబేలెత్తించినా బౌలర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో ఓటమి పాలు కాక తప్పలేదు. ఆస్ట్రేలియా ఓపెనర్

... మిగతా 6వ పేజీలో



స్టేడియంలో మంత్రి లోకేశ్ అభివాదం..



మ్యాచ్ వీక్షిస్తున్న లోకేశ్ తనయుడు దేవాన్ష్

నిధులు వెనక్కి

మనబడి- మన భవిష్యత్తు అగమ్యగోచరం

- పాఠశాలల్లో అసంపూర్తిగా మిగిలిన పనులు
- ఈ విద్యా సంవత్సరంలో పూర్తయ్యేనా?
- మంత్రి లోకేశ్ చొరవ చూపాలని పాఠశాల అభివృద్ధి కమిటీల విజ్ఞప్తి



భీమిలి మండలం అవనాం ప్రాథమిక పాఠశాలలో మధ్యలోనే నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం

విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):

అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టిన పనుల పూర్తికి అవసరమైన నిధుల కేటాయింపులో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యలో నిలిచిన పనులకు ఇటీవల పాఠశాల విద్యాశాఖ కేటాయించిన నిధులు సుమారు రూ.13 కోట్లు తిరిగి వెనక్కి తీసుకోవడంతో పాఠశాల అభివృద్ధి కమిటీలు నిరాశకు గురయ్యాయి.

గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద జిల్లాలోని రెండో దశ 309 పాఠశాలల్లో రూ.114 కోట్లతో చేపట్టిన పనులు 2023 మధ్యలోనే నిలిచిపోయాయి. ఇందుకోసం రూ.48 కోట్ల వరకు నిధులు ఖర్చు చేయగా, మరో రూ.40 కోట్ల విలువైన మెటీరియల్... అంటే ఇనుము, సిమెంటు, ఇసుక, తలుపులు, కిటికీలు వంటి వాటిని సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ నుంచి సరఫరా చేశారు. మరో రూ.30 కోట్లు అవసరమని

... మిగతా 6వ పేజీలో

తీరానికి... తాటి కవచం!

గ్రేట్ గ్రీన్ వాల్ కాన్సెప్ట్ అమలుకు అటవీశాఖ ప్రణాళిక

- ఉత్తరాంధ్ర పరిధిలో 2.5 లక్షల తాటిచెట్ల పెంపకం
- సరుగుడు, ఇతర మొక్కలు నాటేందుకు నిర్ణయం
- మడ అడవుల పెంపకానికి శ్రీకారం
- తుఫాన్ల నుంచి రక్షణకు చర్యలు



నక్కపల్లి మండలం సముద్ర తీరంలో తాటి చెట్లు

విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో సంభవించే తుఫాన్‌ల సమయంలో తొలుత ప్రభావితమయ్యేది తీర ప్రాంతమే. ఆ సమయంలో వీచే పెనుగాలుల ధాటికి అపార నష్టం వాటిల్లుతుంది. అలలు ఎగిసిపడి సమీప గ్రామాల్లోకి సముద్ర జలాలు చొరబడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లు, భూములు, కమ్యూనికేషన్లు, విద్యుత్ స్తంభాలు, టవర్లు దెబ్బతింటాయి. తీరంపొడవునా కోత తీవ్రత ఎక్కువవుతుంది. దీంతో నగరంలోని బీచ్‌రోడ్డు నిత్యం కోతకు గురై నష్టం సంభవిస్తోంది. ఇలాంటి విపత్తుల నుంచి తీర ప్రాంతానికి రక్షణగా నిలిచేలా 'గ్రేట్‌గ్రీన్‌వాల్' అమలుకు రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర ప్రణాళిక రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టింది.

ఐదేళ్లపాటు అమలుచేసే 'గ్రేట్‌గ్రీన్‌వాల్ కార్యక్రమం'లో తీరానికి ఆనుకుని తొలి వరుసలో తాటిచెట్లు, రెండో వరుసలో సరుగుడు, ఆ తరువాత జీడి, అనువుగా ఉండే చోట మడ అడవుల పెంపునకు విశాఖ సర్కిల్ అటవీశాఖ కార్యాచరణ అమలుచేస్తోంది. సర్కిల్ పరిధిలోని ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు 344 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. తీరం పొడవునా సుమారు ఎనిమిదివేల హెక్టార్ల అటవీశాఖ, దీనికి ఆనుకుని రెవెన్యూశాఖకు భూములు ఉన్నాయి. తీరం నుంచి భూ ఉపరితలం వైపు లోపలికి ఐదు కిలోమీటర్ల వెడల్పులో 'గ్రేట్‌గ్రీన్‌వాల్ కార్యక్రమం' అమలుచేస్తారు. మొదటి వరుసలోతాటి వనాలు పెంచుతారు. ఇందుకుగాను విశాఖ సర్కిల్‌లో రెండున్నరలక్షల తాటిచెట్లు పెంచేందుకు టెంకలు సిద్ధంచేశారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తాటి పొదల నుంచి వీటిని సేకరించారు. టెంకలను తీరం పొడవునా నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్లపాటు వీటిని నాటాలని ప్రణాళికలో పొందుపరిచారు.



తీరం పొడవునా నాటేందుకు తాటి టెంకలను సిద్ధం చేస్తున్న దృశ్యం

తుఫాన్ల ధాటిని నిలువరించేలా..

తీరంలో ఉప్పుగాలులకు తట్టుకుని తాటిచెట్లు పెరుగుతాయి. సుమారు 40 నుంచి 50 అడుగుల ఎత్తు

... మిగతా 6వ పేజీలో

అభా.. కదలదేంటబ్బా!



ప్రజారోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో నిక్షిప్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం

- అభా పేరిట హెల్త్ ఐడీ రూపకల్పన
- దేశంలోని ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగి ఐడీ నంబరుతో ఆరోగ్య స్థితి తెలుసుకునే అవకాశం
- జిల్లాలో మందకొడిగా సాగుతున్న ప్రక్రియ
- వివరాలివ్వని గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్‌ల వాసులు
- ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కలెక్టర్, డీఎంహెచ్‌వో విజ్ఞప్తి

విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):



ప్రజల ఆరోగ్య స్థితిగతులను డిజిటల్ విధానంలో నిక్షిప్తం చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) ప్రక్రియ జిల్లాలో మందకొడిగా సాగుతోంది. ఆయుష్మాన్ భారత్ ప్రొగ్రామ్‌లో భాగంగా ఆధార్ తరహాలో 14 అంకెల నంబరుతో ఆరోగ్య సమాచారాన్ని అందించేలా డిజిటల్ హెల్త్ ఐడీ విధానానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగి ఆరోగ్య సమాచారం ఆ హెల్త్ అకౌంట్ నుంచి తెలుసుకునేలా దీనిని రూపొందించింది. అయితే ప్రజలకు దీనిపై సరైన అవగాహన లేకపోవడంతో ఆసక్తి చూపడం లేదు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు

... మిగతా 6వ పేజీలో

త్వరలో వినియోగంలోకి రుషికొండ ప్యాలెస్

- అభిప్రాయాలు కోరిన ప్రభుత్వం
- 17న విజయవాడలో సమావేశం



విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రుషికొండలో గత వైసీపీ ప్రభుత్వం రూ.450 కోట్లతో నిర్మించిన ప్యాలెస్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేకమంది నాయకులు రుషికొండకు వచ్చి ప్యాలెస్‌ను పరిశీలించారు. ఇటీవల పంచాయతీరాజ్, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సందర్శనలో కొన్ని చోట్ల పైకప్పు పెచ్చులు ఊడిపోయి, గోడలకు నీరు చిమ్మిన దృశ్యాలు

... మిగతా 6వ పేజీలో

నిధుల కోసం ఎదురుచూపులు

రిజిస్ట్రేషన్ల ఆదాయానికి పంచాయతీల ఆరాటం

- జిల్లాకు రూ.10 కోట్ల మేర బకాయిలు
- అభివృద్ధి పనులకు అవరోధం

విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):

భూముల క్రయ విక్రయాల కోసం వసూలుచేసే స్టాంప్ డ్యూటీ నుంచి స్థానిక సంస్థలకు అందాల్సిన 25 శాతం నిధులకు గ్రామ పంచాయతీలు సుమారు మూడేళ్లుగా ఎదురుచూస్తున్నాయి. రాష్ట్రంలో కొన్ని జిల్లాలకు సొమ్ములు విడుదలచేసిన ప్రభుత్వం మరికొన్ని జిల్లాలకు ఇవ్వలేదు. ఈ జాబితాలో విశాఖ ఉంది. జిల్లాలో 79 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నగరానికి ఆనుకుని ఆనందపురం, భీమిలి, పెందుర్తి మండలాలు ఉండడంతో భూముల రిజిస్ట్రేషన్ విలువ ఎక్కువగా ఉంటుంది. దీనికి



గంభీరం పంచాయతీ

తోడు రాజాపులోవ నుంచి పినగాడి వరకు జాతీయ రహదారి పొడవునా ఉన్న గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయి. దీంతో ఆయా పంచాయతీల పరిధిలో భూములు క్రయవిక్రయాల సందర్భంగా చెల్లించే స్టాంపుడ్యూటీలో నాలుగుశాతం గ్రామ పంచాయతీలకు చెల్లించాలి. ఈ సొమ్ములు జనరల్ ఫండ్‌కు జమచేస్తారు. ఆ నిధులతో పంచాయతీల్లో పలు రకాల అభివృద్ధి పనులు చేపడతారు.

గత ప్రభుత్వ నిర్వాకం

వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలి రెండేళ్లు ఎప్పటికప్పుడు స్టాంపుడ్యూటీ సొమ్ములు పంచాయతీలకు జమచేశారు. ఆ తరువాత సొమ్ములు ఇవ్వడంలో పాలకులు పెద్దగా పట్టించుకోలేదు. దీంతో 2022-23 చివరి నుంచి ఇప్పటివరకు కొన్ని పంచాయతీలకు, 2023-24 నుంచి మరికొన్ని పంచాయతీలకు స్టాంపుడ్యూటీ ద్వారా రావాల్సిన నిధులు విడుదలచేయలేదు. నగరానికి ఆనుకుని ఉన్న పంచాయతీల పరిధిలో భూముల క్రయవిక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల వీఎంఆర్‌డీఏ భూసమీకరణ ద్వారా అభివృద్ధిచేసిన లేఅవుట్‌లలో రైతులకు వచ్చిన ప్లాట్లను విక్రయించారు. అధికారుల

... మిగతా 6వ పేజీలో

సింహాద్రినాథునికి స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ చేశారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు స్వర్ణ సంపెంగలతో అర్చనలు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు శేషవస్త్రాలు ప్రసాదాలు అందజేశారు. తరువాత ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

'నివాసాల మధ్య సెల్ టవర్ వద్దు'

మధురవాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మిథిలాపురి వుడాకాలనీలో నివాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. కాలనీలోని వాటర్ ట్యాంక్ సమీపంలో ఐదంతస్థుల భవనంపై సెల్ టవర్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రిమూర్తిరాజు మాట్లాడుతూ నివాసాల మధ్య టవర్ ఏర్పాటు చేయడంతో రేడియేషన్ వల్ల ఆరోగ్యాలు పాడవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు టవర్ ఏర్పాటుకు ఎలా అనుమతి ఇచ్చారని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

మంత్రి లోకేశ్ కృషి వల్లే ఐటీ పరిశ్రమలు

తగరపువలస, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారా లోకేశ్ కృషి వల్లే విశాఖకు ఐటీ పరిశ్రమలు వస్తున్నాయని నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు ఎస్. హేమంత్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

రెండో వార్డులో అంతర్గత రోడ్ల నిర్మాణం

తగరపువలస, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని శివారు ప్రాంతాలకు అంతర్గత రహదారులు నిర్మిస్తున్నామని కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె సంగివలసలో రూ. 1.4 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు.

తాళ్లవలసలో దళితుల రాస్తారోకో

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) :సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పుతో దాడి చేయడాన్ని నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో తాళ్లవలస జాతీయ రహదారిపై దళితులు ఆదివారం రాస్తారోకో చేశారు. తొలుత వారు జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రతికా, స్మృతి పోరు వృథా!

... 5వ పేజీ తరువాయి

అలిస్సా హీలి భారీ సెంచరీతో (142) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి తమ ఖాతాలో మరో విజయాన్ని నమోదు చేసింది. భారత్‌పై దక్షిణాఫ్రికా చివరిగా సిక్సర్ కొట్టి గెలుపొందగా...ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కూడా ఆస్ట్రేలియా సిక్సర్‌తోనే విజయం సాధించడం విశేషం.

చెలరేగిన స్మృతి మంధాన, ప్రతికా రావల్

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ప్రతికా రావల్ (75), స్మృతి మంధాన (80) చెలరేగారు. ఎనిమిదో ఓవర్లో సోఫీ బౌలింగ్‌లో స్మృతి మంధాన స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీ, లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, మిడ్ వికెట్ మీదుగా మరో బౌండరీ బాది స్కోరు బోర్డును పరిగెత్తించింది. అదే ఓవర్లో స్క్వేర్ లెగ్ వద్ద అవుట్ నుంచి తప్పించుకుంది. తొమ్మిదో ఓవర్‌లో గార్డనర్ బౌలింగ్‌లో మరో ఓపెనర్ ప్రతికా రావల్ లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, మిడాఫ్ మీదుగా బౌండరీ కొట్టి ఆసీస్ బౌలర్లను బెంబేలెత్తించింది. స్మృతి మంధాన 46 బంతుల్లో 7 బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేయగా...ప్రతికా రావల్ 69 బంతుల్లో 7 బౌండరీలు, ఒక సిక్సర్‌తో హాఫ్ సెంచరీ సాధించింది.

నాలుగు ఓవర్లలో ఐదు వికెట్లు

భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్ మహిళలు అనవసర షాట్లకు ప్రయత్నించి వికెట్లు పోగొట్టుకున్నారు. ఫలితంగా మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే, 48.5 ఓవర్లకు ఆలౌటయ్యారు. వికెట్ల ముందు సెటిల్ అయిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ (22), రోడ్రిగస్ (33), రిచా ఘోష్ (32) అనవసర షాట్‌లతో వికెట్లు సమర్పించుకున్నారు. నాలుగు ఓవర్లలో వరుసగా ఐదు వికెట్లు పోగొట్టుకోవడం ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

సెంచరీతో హీలి కెప్టెన్ ఇన్నింగ్స్

ఆస్ట్రేలియా ఓపెనర్ అలిస్సా హీలి సెంచరీతో (142) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి భారత్ ఆశలపై నీళ్లు చల్లింది. మరో ఓపెనర్ లిచ్ ఫీల్డ్ (40) రాణించడంతో 15 ఓవర్లలోనే వంద పరుగులు పూర్తిచేసిన ఆస్ట్రేలియా దీటైనా జవాబు ఇచ్చేలా దూసుకుపోయింది. లిచ్ ఫీల్డ్ స్థానంలో దిగిన పెర్రీ (47; రిటైర్డ్ హర్ట్) క్రీజులో ఉన్నంతసేపు భారత్ మ్యాచ్‌పై పట్టు సాధించలేకపోయింది. అలిస్సా హీలి 84 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీ పూర్తిచేసి పటిష్ఠ స్థితికి చేర్చింది. తర్వాత వచ్చిన ఆసీస్ బ్యాటర్లను భారత్ బౌలర్లు కట్టడి చేయడంలో విఫలమయ్యారు. సెకెండ్ స్పెల్‌లో అమన్‌జోత్ కౌర్ అద్భుత బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. రిటైర్డ్ హర్ట్ అయిన పెర్రీ తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి స్నేహ రానా బౌలింగ్‌లో లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్ బాదడంతో ఆస్ట్రేలియా 49 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది.

తీరానికి.. తాటి కవచం!

... 5వ పేజీ తరువాయి

పెరుగుతాయి. తుఫాన్‌గాలులను నిలువరిస్తాయి. గతంలో దివిసీమ తుఫాన్ తరువాత కోస్తాతీరం వెంబడి భారీగా తాటి, సరుగుడు వనాలు పెంచారు. ఆ తరువాత రెండోవరుసలో సరుగుడు వనాలు పెంచనున్నారు. ఈ ఏడాది 20 లక్షల సరుగుడు మొక్కలు నాటాలని అటవీశాఖ నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి 30 నుంచి 40 లక్షల సరుగుడు మొక్కలు నాటుతారు. ఆ తరువాతి వరుసలో రైతుల భూముల్లో జీడితోటల పెంపకాన్ని ప్రోత్సహించనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో అనువుగా ఉండే చోట మడ అడవులు పెంచుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పలు పథకాల ద్వారా తాటి, సరుగుడు, మడ అడవులు పెంపకం చేపడతారు. కోస్తా తీరం మొత్తం ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు అమలుకు రూ.500 కోట్లు వెచ్చించనున్నారు.

కార్యాచరణ రూపొందించాం

'గ్రేట్‌గ్రీన్‌వాల్ కార్యక్రమం' అమలుకు శాఖాపరంగా కార్యాచరణ రూపొందించామని విశాఖ సర్కిల్ కన్జర్వేటర్ బీఎం దివాన్ మైదీన్ తెలిపారు. ఈ పథకం వల్ల పెరగనున్న తాటి, సరుగుడు వనాల ద్వారా తీర ప్రాంతానికి రక్షణ లభిస్తుందన్నారు. గతంలోనూ తీరం పొడవునా వీటిని పెంచారని, మరోసారి తాటి, సరుగుడు వనాలు పెంచడం ద్వారా తీర ప్రాంతం కోత, తుఫాన్‌లు సంభవించేటప్పుడు వీచే పెనుగాలుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు.

అభిమానులకు ఫుల్ జోష్

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో పరుగుల వరద



భారత్- ఆస్ట్రేలియా మ్యాచ్‌కు హాజరైన అభిమానులు



వికెట్ తీసిన ఆనందంలో ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లు



వికెట్ తీసిన ఆనందంతో శ్రీచరణ్



భారత్ బ్యాటింగ్‌కు అమ్మాయిల ఆనందం



ప్లకార్డుతో అభిమానం



ప్రతికారావల్, స్మృతి మంధాన బ్యాటింగ్

'ఉక్కు' కోక్-ఓవెన్ బ్యాటరీ విభాగంలో స్వల్ప ప్రమాదం



కోక్-ఓవెన్ బ్యాటరీ-5 విభాగంలో చెలరేగిన మంటలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ కోక్-ఓవెన్ బ్యాటరీ-5 విభాగంలో ఆదివారం మధ్యాహ్నం స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. బ్యాటరీ విభాగం-5లో కింద నుంచి పైవరకు కోక్‌ను తీసుకువెళ్లే లాడిల్ పైకి వచ్చేసరికి ఒక్కసారిగా జారిపడిపోయింది. ఆ సమయంలో లాడిల్‌లో ఉన్న కోక్ బ్యాటరీపై పడింది. దీంతో స్వల్పంగా మంటలు చెలరేగాయి. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

'అయ్యప్ప సేవలో రాజకీయ జోక్యం సరికాదు'

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన అయ్యప్ప సేవా సంఘం అఖిల భారత సదస్సుకు లక్ష్మీపురం గ్రామానికి చెందిన గాడు తాతినాయుడు జాతీయ కార్యదర్శి హోదాలో హాజరయ్యారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శబరిమలై అయ్యప్పస్వామి కార్యకలాపాలన్నీ రాజకీయ జోక్యం లేకుండా జరగాలని, ట్రావెన్‌కోర్ బోర్డు ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది అయ్యప్ప మాలధారణ వేయడం వల్ల కేరళ రాష్ట్రానికి ఎంతో ఆదాయం వస్తుందని, దాన్ని ధార్మిక కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు.

వరి పంట పరిశీలన

పద్మనాభం రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) :వరి పంటకు దోమపోటు ఉధృతంగా ఉందని ఏఓ ఎంవీ చలం తెలిపారు. ఆదివారం ఆయన రెడ్డిపల్లి, తునివలస, అర్చకుని పాలెం గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పంటకు దోమ పోటు అధికంగా ఉందని, దీని నివారణకు ఎకరాకు మెట్రోజైన్ 120 గ్రాములు, లీటరు నీటిలో కలిసి పిచికారీ చేయాలని సూచించారు. పొట్ట దశలో ఎకరాకు 20 కిలోల పొటాష్ వేయాలని చెప్పారు.

6న గాయకుడు కార్తీక్ లైవ్ షో

రామ్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు కార్తీక్ లైవ్ మ్యూజిక్ ప్రదర్శన డిసెంబరు 6న విశాఖలో నిర్వహించనున్నట్టు నిర్వాహక ప్రతినిధి షోవెన్ తెలిపారు. కార్తీక్ తెలుగు, తమిళ, కన్నడ, హిందీ తదితర భాషలలో సుమారు 8 వేల పాటలు ఆలపించారన్నారు.

విశాఖే ఆర్థిక రాజధాని

... 5వ పేజీ తరువాయి

కట్టారన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారని, అప్పుడు కూడా తెల్లవారుజామున మూడు గంటలకు నిద్ర లేచి మూడు లక్షల మంది బీచ్‌కు తరలివచ్చారని గుర్తు చేశారు. విశాఖపట్నాన్ని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా చేస్తామన్నారు. ఐటీలో హైదరాబాద్ 30 ఏళ్లకు అభివృద్ధి సాధిస్తే.. అదే అభివృద్ధిని ఇక్కడ పదేళ్లలో సాధించాలని ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. సమీక్ష సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఏపీ కోఆపరేటివ్ గ్రోవర్స్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు స్వప్నిల్ దినకర్ పుండర్కర్, రామసుందరరెడ్డి, ఎంఎన్ హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, విశాఖ జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, వీఎంఆర్‌డీఏ సీయూపీ శిల్ప ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



సత్యం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం (రూరల్),అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు వంకల సత్యం కుటుంబానికి భీమిలి మండలం ఉపాధ్యాయులు ఆదివారం రూ.1.37 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఆయన భీమిలి మండలంలో పనిచేస్తూ ఈఏడాది జూన్‌లో బదిలీపై ఎస్.రాయవరం మండలానికి వెళ్లారు. పాఠశాల నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఎలమంచిలి వద్ద లారీ ఢీకొనడంతో మృతి చెందారు. ఈమేరకు రవీంద్రనగర్‌లో ఉంటున్న అతని కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఆర్. అప్పలరాజు, సన్యాసినాయుడు, పరదేశి, సుదర్శనరావు, పాల్గొన్నారు.

ముగిసిన మూట్ కోర్ట్ పోటీలు

సాగర్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి పేరిట గీతం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మూట్ కోర్ట్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 42 బృందాలు పాల్గొన్నాయి. నార్కొటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం ఆధారంగా నిర్వహించిన పోటీల్లో కటక్ (ఒడిశా)కు చెందిన మధుసూదన్ న్యాయ కళాశాల ప్రథమ స్థానంలో నిలవగా కర్ణాటకు చెందిన క్రిస్ట్ డీమ్డ్ విశ్వవిద్యాలయం రన్నరప్‌గా నిలిచింది. ఉత్తమ రీసెర్చర్ అవార్డు పూణేకు చెందిన సింబయాసిస్ న్యాయ కళాశాల, ఉత్తమ స్పీకర్ అవార్డు ప్రయాగరాజ్‌కు చెందిన షంబూనాథ్ న్యాయ కళాశాల కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ గురుగుబెల్లి యతిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, గీతం న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ. రాజేంద్ర ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ చల్లా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

భీమునిపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జవాబుదారీతనాన్ని మెరుగుపరచడానికి కేంద్రం 2005లో సమాచార హక్కు చట్టం అమలు చేసిందని సమగ్ర శిక్ష గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసరు,జీసీడీఓ శ్రీదేవి తెలిపారు. ఆర్‌టీఐ అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గొల్లలపాలెం కేజీబీవీలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ప్రభుత్వ సంస్థల నుంచి భారత్ పౌరులు సమాచారం పొందేందుకు హక్కు ఉంటుందన్నారు. సమగ్ర శిక్ష ఏఎల్ఎస్‌ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అవినీతిని నిరోధించడానికి ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆర్‌టీఐ యొక్క ప్రయోజనాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే బాలికలు పరిసర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం : పద్మనాభం కేజీబీవీలో బాలికలకు సమగ్ర శిక్ష అభియాన్‌కు చెందిన జీసీడీఓ శ్రీదేవి, సెక్టోరల్ అధికారి శ్రీనివాసరావు సమాచార హక్కు చట్టంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టం ఏర్పాటు చేసి 20 వసంతాలు పూర్తయిన సందర్భంగా చట్టం ఆవశ్యకత, చట్టాన్ని ఉపయోగించి ప్రభుత్వ విభాగాల నుంచి సమాచారం పొందే విధానాలను వివరించారు. ప్రతిఒక్కరూ చట్టాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందవచ్చన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు వెనక్కి

... 5వ పేజీ తరువాయి

అప్పట్లోనే గుర్తించారు. నాడు-నేడు తొలిదశ పనులకు చకాచకా నిధులు కేటాయించిన అప్పటి ప్రభుత్వం, రెండో దశపై పూర్తి నిర్లక్ష్యాన్ని చూపింది. దీనివల్ల చాలా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. ఇతరత్రా వసతులు కూడా అందుబాటులోకి రాలేదు. లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, ప్రహరీల పనులు సగంలోనే ఆగిపోయాయి. కొన్నిచోట్ల అదనపు గదుల నిర్మాణాలు పూర్తైనా వాటికి తలుపులు, కిటికీలను ఏర్పాటు చేయలేదు. భవనాలకు రంగులు వేయలేదు. ఈలోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకానికి 'మన బడి-మన భవిష్యతు'గా పేరు మార్చి పనుల పూర్తికి నిధులు కోరడంతో జిల్లాకు రూ.30 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఈనిధులతో పాటు మెటీరియల్ సరఫరా చేయాలని కోరారు. మరోపక్క అసంపూర్తి పనులు చేపట్టాలని పాఠశాల అభివృద్ధి కమిటీలు జిల్లా విద్యాశాఖను ఏడాదిగా కోరగా తొలివిడత రూ.13 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలలో వచ్చిన నిధులను వెనక్కి పంపించేశారు. జిల్లాలో విద్యార్థులు ఎక్కువగా ఉండి అరకొర వసతులు ఉన్న చంద్రంపాలెం, తోటగరువు, సునీల్‌శర్మ కాలనీ ఉన్నత పాఠశాలల్లో ఇబ్బందులు నెలకొన్నాయి. ఇప్పటికే స్లాబులు వేసి తలుపులు, కిటికీలు బిగించడం, సున్నాలు వేసి విద్యుత్ సరఫరాకు వీలుగా నిధులిస్తే పలు పాఠశాలల్లో అదనపు గదులు అందుబాటులోకి వస్తాయని పాఠశాల అభివృద్ధి కమిటీలు కోరుతున్నాయి. దీనిపై మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

మాట్లాడుతున్న విశాఖ విభాగ్ ప్రచార ప్రముఖ్ నీలం రామకృష్ణ



మాట్లాడుతున్న విశాఖ విభాగ్ ప్రచార ప్రముఖ్ నీలం రామకృష్ణ

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ విజయదశమి ఉత్సవాలు

పద్మనాభం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్ ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ పద్మనాభం సంఘ మండలి ఆధ్వర్యంలో ఆదివారం విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంఘ శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని మండలిలోని తొమ్మిది గ్రామాల నుంచి వచ్చిన స్వయం సేవకులు ఉత్సవంలో పాల్గొని భగవా ధ్వజానికి ప్రణామం చేశారు.ఈ సందర్భంగా ముఖ్య వక్తగా వచ్చిన ఆర్‌ఎస్‌ఎస్ విశాఖ విభాగ్ ప్రచార ప్రముఖ్ నీలం రామకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ కేశవరావ్ బలిరాం హెడ్గేవార్ స్థాపించిన సంఘం ఆయన ఆశయాల మేరకు భారతదేశాన్ని విశ్వగురువుగా చేయడానికి, పరమ వైభవోపేతమైన స్థితికి తీసుకురావడానికి సేవకులు నిరంతరం పనిచేస్తూ అనేక సేవా, ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు కూడా చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా దేశ చరిత్రకు సంబంధించిన అంశాలతో పాటు సంఘం వందేళ్ల ప్రస్థానానికి సంబంధించిన చిత్ర ప్రదర్శన, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆనందపురం ఖండ కార్యవాహ బాలి రవి, గోస్తనీ విద్యాపీఠ్ వ్యవస్థాపకుడు కె. సూరిబాబు, సంఘ్ పెద్దలు మురళిమోహన్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. రెడ్డిపల్లి సంఘ మండలిలో విశాఖ మహానగర్ కార్యవాహ టి. నరసింగరావు ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం జరిపారు.

వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని వినతి



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోపాలరెడ్డి

విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసిస్తూ తాను సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టుకు స్పందించి తన కుటుంబాన్ని ఉద్దేశించి అసభ్యకరంగా పోస్టు పెట్టిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం లోకేశ్‌ను ఎయిర్‌పోర్టుల ఆయన కలిసి ఫేక్ ఖాతా ద్వారా తన కుటుంబాన్ని ఉద్దేశించి చేసిన అసభ్య పదజాలంతో చేసిన వ్యాఖ్యలపై సీపీకి ఫిర్యాదు చేస్తే సైబర్ క్రైమ్ సీఐ భవానీప్రసాద్‌కు దర్యాప్తుచేయాలని ఆదేశించారన్నారు. ఇంతవరకు సదరు వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందువల్ల తక్షణమే విచారణ జరిపి చర్యలు చేపట్టేలా చూడాలని లోకేశ్‌ను కోరారు.

అభా.. కదలదేంటబ్బా!

... 5వ పేజీ తరువాయి


ఇప్పటికే హెల్త్ ఐడీని క్రియేట్ చేశారు. రెండేళ్లుగా ఈ కార్యక్రమం పెద్దఎత్తున సాగుతోంది. జిల్లాలో సుమారు 22 లక్షల మంది ప్రజలకు అభా హెల్త్ అకౌంట్ ఓపెన్ చేసి ఐడీ నంబరు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 18 లక్షల మందికి హెల్త్ ఐడీ నంబర్లను క్రియేట్ చేశారు. మరో 4.15 లక్షల మందికి సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగడంలేదు. రిజిస్ట్రేషన్ చేయించుకోని వారంతా అపార్ట్ మెంట్లు, గ్రూప్‌హౌస్‌ల్లో ఉంటున్న వారే కావడం గమనార్హం. అభా హెల్త్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసేందుకు వచ్చే ఆరోగ్య సిబ్బందిని అనుమతించకపోవడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. ఆయా ప్రాంతాలకు చెందిన ఏఎన్‌ఎం, ఇతర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అభా ఐడీ యాప్‌లో సదరు వ్యక్తి ఆధార్ నంబరును ఎంటర్ చేయాల్సి ఉంటుంది. వెంటనే అతని ఫోన్ నంబరుకు ఓటీపీ వెళ్తుంది. ఆ ఓటీపీ చెబితేనే అభా ఐడీ క్రియేట్ అవుతుంది. ఆ తరువాత హెల్త్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకునేందుకు అవకాశం ఉంది.

ఓటీపీతోనే సమస్య

అయితే అనేక చోట్ల ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడానికి ప్రధాన కారణం సిబ్బందికి ఓటీపీ చెప్పాల్సి రావడమేనని అధికారులు చెబుతున్నారు. ఓటీపీ చెబితే డబ్బులు పోతాయనే భయంతో ఆరోగ్య సిబ్బందికి చాలామంది సహకరించడంలేదు. కొన్నిచోట్ల గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్ వాసులు సిబ్బందిని లోపలికి వచ్చేందుకు కూడా అనుమతించడంలేదు. ఈ పక్రియ చేపడుతున్న ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ సూచించినా ప్రయోజనం కనిపించడంలేదని అధికారులు చెబుతున్నారు. దీనిపై ప్రజలు ఆలోచించాలని, ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరుతున్నారు. కొన్ని నెలలుగా ప్రక్రియ ముందుకు కదలడం లేదన్నారు. ప్రజలు సహకరిస్తేనే హెల్త్ ఐడీ నమోదు ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

ఐడీ నంబరుతో ఎంతో మేలు

అభా ఐడీతో కూడిన హెల్త్‌కార్డులు పొందడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఈ నంబరు కలిగి ఉంటే దేశంలోని ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగికి సంబంధించిన రిపోర్టులు, ఇతర వివరాలు తమ వెంట తీసుకువెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ వివరాలన్నింటినీ డిజిటల్ పద్ధతిలో ఈ అకౌంట్‌లో స్టోర్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. దేశంలోని ఏ ఆస్పత్రికి వెళ్లినా నంబరు నమోదు చేయగానే రోగికి సంబంధించిన ఆరోగ్య చరిత్ర డిస్‌ప్లే అవుతుంది. వెంటనే వైద్యులు తదుపరి పరీక్షలు, ఇతర వైద్య సేవలను అందించేందుకు వీలుంటుంది. పేపర్‌లెస్ వైద్య విధానాన్ని అందించేందుకు హెల్త్ ఐడీ దోహదపడుతుదని అధికారులు వివరిస్తున్నారు.



పర్యాటకులతో కిటకిటలాడుతున్న రుషికొండ బీచ్



సందర్శకులతో రద్దీగా ఉన్న భీమిలి బీచ్ రోడ్డు

సందడే.. సందడి

రుషికొండ, భీమిలి బీచ్‌లకు సందర్శకుల తాకిడి

సాగర్‌నగర్/భీమునిపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, రుషికొండ, సాగర్‌నగర్ తీరాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. వీకెండ్ కావడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా రుషికొండ బీచ్ పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో దేశ, విదేశీయుల తాకిడి ఎక్కువైంది. సందర్శకుల్లో కొందరు బోటు షికారు, సముద్రం స్నానాలు చేసి కేరింతలు కొట్టగా, మరికొందరు ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడుతూ గడిపారు. చిన్నారులు బీచ్‌లో ఉన్న పార్కులో ఆటల ఆడుతూ సందడిగా కనిపించారు. కాగా పర్యాటకుల రద్దీ వల్ల బీచ్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

నిధుల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

అంచనా మేరకు 10 కోట్ల స్టాంపుడ్యూటీ వాటా పంచాయతీలకు రావాల్సి ఉంది.

పంచాయతీలకు గ్రేడ్లు

ఇటీవల గ్రామ పంచాయతీలకు గ్రేడ్లు ప్రకటించిన నేపథ్యంలో ఆదాయ వ్యయాలను అధికారులు నిర్ధారించారు. అంటే సాధారణ నిధులు, కేంద్రం విడుదలచేసే ఆర్థిక సంఘం నిధులు, ఇంటి పన్నులు, వాణిజ్య సముదాయాలు, సంతల ద్వారా వచ్చే ఆదాయంతోపాటు స్టాంపుడ్యూటీ బకాయిలను పరిగణనలోకి తీసుకున్నారు. ఆదాయ ఆర్జన మేరకు పంచాయతీలకు గ్రేడింగ్ ఇచ్చారు. జిల్లాలో ఎక్కువ పంచాయతీలకు గ్రేడ్ 1,2.. ఇలా పలు హోదాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రూ .10 కోట్ల వరకు స్టాంపుడ్యూటీ వాటా రావాల్సి ఉంటుందని సమాచారం. పంచాయతీల విస్తరణలో భాగంగా చాలా గ్రామాల్లో కొత్తగా కాలనీలు, నివాసాలు వస్తున్నాయి. దీంతో వసతులు ముఖ్యంగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, తాగునీటా సరఫరా, విద్యుత్ లైన్ల ఏర్పాటు, పారిశుధ్యం నిర్వహణ చేపడుతున్నారు. దీనికి నిధులు అవసరమని సర్పంచ్‌లు చెబుతున్నారు. ఆర్థిక సంఘం నిధులు సరిపోవడంలేదని స్టాంపుడ్యూటీ వాటా విడుదల చేయాలని గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి కోరారు. గత ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేస్తే మౌలిక వసతులు కల్పిస్తామంటున్నారు.

త్వరలో వినియోగంలోకి రుషికొండ ప్యాలెస్

... 5వ పేజీ తరువాయి

బయటపడ్డాయి. విలువైన భవనాన్ని ఖాళీగా ఉంచకుండా పర్యాటక సీజన్ నాటికి ఏదో ఒక విధంగా ఉపయోగంలోకి తేవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మూడు నెలల తరువాత కమిటీ రెండు రోజుల క్రితం విజయవాడలో సమావేశమై ప్యాలెస్ వినియోగంపై చర్చించింది. దీనిపై ప్రజలతో పాటు జాతీయ, అంతర్జాతీయ ఆతిథ్య సంస్థల నుంచి సూచనలు తీసుకోవాలని అభిప్రాయపడింది. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక సంస్థ ఆదివారం ప్రకటన జారీ చేసింది. రుషికొండ ప్యాలెస్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న తొమ్మిది ఎకరాల భూమిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో వారం రోజుల్లోగా అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. సూచనలను ఏపీ టూరిజం వెబ్‌సైట్‌కు పంపాలని సూచించింది. దాంతో పాటు ఈ నెల 17వ తేదీన విజయవాడ ఆటోనగర్‌లోని పర్యాటక శాఖ సీఈఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తామని, దానికి జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరై సూచనలు ఇవ్వాలని కోరింది.


పాముల మోటు వద్ద పర్యాటకులు

జూకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. దాదాపు నాలుగు వేల మంది సందర్శించారు. వీరి నుంచి దాదాపు రూ.3.1 లక్షల ఆదాయం ప్రవేశ రుసుము ద్వారా సమకూరినట్లు జూ పార్కు క్యూరేటర్ జి. మంగమ్మ తెలిపారు.

టీ షర్టులకు డిమాండ్


టీ షర్టు కొనుగోలు చేస్తున్న అభిమానులు

ఆరిలోవ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాత డెయిరీ ఫారం వద్ద క్రికెట్ అభిమానులు టీషర్టులు కొనుగోలు చేయడానికి ఎగబడ్డారు. ఆదివారం మధురవాడ వద్ద గల స్టేడియంలో భారత-ఆస్ట్రేలియా మధ్య మహిళల క్రికెట్ చూడడానికి కుటుంబ సమేతంగా ఎక్కువ మంది తరలి వెళ్లారు. పాత డెయిరీ ఫారం వద్ద తమ వాహనాలను ఆపి టీషర్టులు కొనుగోలు చేశారు.

చిన్నారుల ర్యాంప్ వాక్

రామ్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయ వస్త్రాలు ధరించి చిన్నారులు ర్యాంప్‌వాక్ చేస్తూ అలరించారు. ఆదివారం రామ్‌నగర్‌లోని ఓ హోటల్‌లో గ్లామ్ రన్ వే డ్యాన్స్ మెగా ఫైనల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 3 నుంచి 14 ఏళ్ల వయస్సు పిల్లలు షోలో పాల్గొన్నారు. వీరు మామ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

బ్రెయిన్ డెడ్ మహిళ అవయవ దానం



ఆరిలోవ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ తాను మృతి చెందినా నలుగురి జీవితాల్లో వెలుగు నింపారు. విశాలాక్షినగర్‌కు చెందిన కె. అన్నపూర్ణ (50) హనుమంతవాక కూడలిలో రోడ్డు దాటుతుండగా శనివారం బైక్ ఢీకొంది.తీవ్ర గాయాలు కావడంతో విమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్టు గుర్తించారు. ఈమేరకు అన్నపూర్ణ కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకరించడంతో విషయాన్ని జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం అన్నపూర్ణ లీవర్, ఊపిరితిత్తులు, కార్నియా స్వీకరించారు. వాటిని గ్రీన్‌చానల్ ద్వారా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అన్నపూర్ణ భర్త రాజు, కుమారుడు అర్భకులుగా జీవిస్తున్నట్టు విమ్స్ డైరెక్టర్ రాంబాబు తెలిపారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 27, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 34, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 36, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 72, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

రోడ్డుపై నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు

- భవన నిర్మాణదారుల ఇష్టారాజ్యం
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- గాయత్రి స్కూల్ రహదారిలో దుస్థితి


రోడ్డుపై వేసిన భవన నిర్మాణ సామాగ్రి

మద్దిలపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం గాయత్రి స్కూల్ రోడ్డు ఆదివారం శ్లాబుల నిర్మాణాలతో మోతమోగింది. ఫలితంగా రోడ్డు మూత పడింది. గాయత్రి స్కూల్ నుంచి దేవి హోమ్స్ రోడ్డులో ఒకే రోజు నాలుగు భవనాలకు శ్లాబుల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాల కోసం పెద్ద మొత్తంలో పిక్క, ఇసుక, సిమెంట్ రోడ్లపై వేశారు. కాంక్రీట్ మిక్సర్‌లు ఏర్పాటు చేసి రహదారులను దిగ్బంధించారు. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు వెళ్లేందుకు వీల్లేకుండా రోడ్డుకు అడ్డంగా నిర్మాణ సామగ్రిని నిల్వ చేశారు. ఇక్కడ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌లో 150 ఫ్లాట్లు ఉన్నాయి. ఇతర అపార్టుమెంట్లు, నివాసాల వాసులకు సొంత కార్లు ఉన్నాయి. వారంతా మద్దిలపాలెం గాయత్రి స్కూల్ రోడ్డులోనే ప్రయాణించాలి. ప్రత్యామ్నాయ మార్గం లేదు. ఒకే రోజు నాలుగు శ్లాబుల నిర్మాణాలతో రోడ్డు మూసుకుపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. ఎక్కువగా సెలవు రోజుల్లోనే శ్లాబులు వేస్తుంటారు. అక్రమ నిర్మాణాలు చేపట్టే వారికి ఆదివారం శ్లాబులు వేసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు సూచిస్తున్నట్టు సమాచారం. ఆదివారం సెలవు కావడంతో 'మేం రాము.. మీ పని కానచ్చేయండ'ని ఉచిత సలహాలు ఇస్తుంటారని అందుకే ఆదివారం ఎక్కువగా శ్లాబుల నిర్మాణం జరుగుతున్నట్టు చెబుతుంటారు.శ్లాబుల నిర్మాణానికి ముందు రోజే ఆ ప్రాంతంలోని వివిధ ప్రభుత్వ విభాగాలవారికి మామూళ్లు అందిస్తారని ఆరోపణలు ఉన్నాయి. ఆదివారాల్లో రోడ్లను దర్జాగా బ్లాక్ చేసి మరీ శ్లాబులు నిర్మాణం చేస్తుండడం ఆరోపణలకు ఊతమిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆత్మీయ కలయిక..!

- 58 ఏళ్లుగా వీడని స్నేహం
- నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న ఎంజీఎం 1967 బ్యాచ్ పూర్వ విద్యార్థులు


ఎంజీఎం స్కూల్ 1967 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

సిరిపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీ మెమోరియల్(ఎంజీఎం) స్కూల్ 1967 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం వాల్తేరు క్లబ్‌లో సందడిగా జరిగింది. ఏడుపదుల వయస్సు పైబడినవారంతా కుటుంబ అవసరాల రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినా, స్నేహితులను కలుసుకోవాలనే తపనతో విశాఖ చేరుకుని కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ, తమ కుటుంబాలు స్థిరపడిన తీరును స్నేహితులకు వివరిస్తూ ఉప్పొంగిపోయారు. తమ పిల్లలు ఎంత గొప్పగా తమను చూసుకుంటున్నారో చెబుతూ, తమ స్నేహితులంతా మలిదశలో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆఖరి దశలో ఆరోగ్యంగా ఉండటమే గొప్ప ఆస్థిపాస్తులని, అదే విధంగా ఆఖరి దశలో ఆప్యాయంగా పలకరించే స్నేహితులు కూడా అవసరమేనని అభిప్రాయపడ్డారు. తారతమ్యాలు లేకుండా అరేయ్..ఒరేయ్ అంటూ పిలుచుకుంటూ తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా, అందుకు గురువులు నేర్పిన విద్యాబుద్ధులే కారణమని చెప్పి, తమ స్కూల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. అంతేకాకుండా ఎంజీఎం స్కూల్లో ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను భాగస్వాములను చేసి, వారిని ఘనంగా సత్కరించి కానుకలు అందజేశారు. చదువుకునే రోజుల్లో చేసిన అల్లర్లు, నాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆనందంగా గడిపారు.

ఏటా కలుస్తున్నాం : ఎన్ఎస్ ప్రకాశరావు



ఎంజీఎం స్కూల్లో 1967 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్ అంటే ఓ గుర్తింపు ఉంది. ఎక్కడ ఉన్నా, ఏటా అక్టోబరు నెలలో ఓ రోజు కలుసుకుంటాం. 58 ఏళ్లుగా ఆత్మీయ వేడుక జరుపుకుంటున్నాం. అందరినీ పిలిచే బాధ్యతను నేనే చూసుకుంటాను. అందరూ సహకరిస్తారు.


ఫ్రీడమ్ రన్ 6.0లో పాల్గొన్న సీబీఐ అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్ దాస్, తదితరులు

'ఫిట్ ఇండియా'లో అందరూ భాగస్వాములు కావాలి

బీచ్‌రోడ్డు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫిట్ ఇండియా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్‌దాస్ పేర్కొన్నారు. ఆదివారం బీచ్ రోడ్డు వద్ద ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పచ్చదనం, పరిశుభ్రత కోసం శ్రమించాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణపై నగర వాసులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉద్యోగులు అంకిత భావంతో వృత్తిని నిర్వర్తిస్తే ఉన్నత స్థానం సాధ్యమని చెప్పారు.పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రకృతి రమణీయ ప్రాంతాల పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర నిర్వర్తించాలని, జీవావరణ సమతుల్యతకు ఇది ఎంతో అవసరమని వెల్లడించారు. తీర ప్రాంతాల పరిశుభ్రత వలన జీవరాశులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పర్యాటకులకు కూడా బీచ్‌లో ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీబీఐ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యమేల..?


మెట్లపై పడి ఉన్న చెట్టు

సిరిపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ద్రోణంరాజు సర్కిల్ నిర్వహణపై జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. సర్కిల్ ప్రాంగణంలోని చెట్టు ఇటీవల వర్షాలకు పక్కకు ఒరిగిపోయి విగ్రహం మెట్లపై పడింది. దీనిని తొలగించి, చెట్టును బతికించేందుకు జీవీఎంసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవటంపై పర్యావరణ వేత్తలు తీవ్ర అసంతృప్తివ్యక్తం చేస్తున్నారు. వీఎంఆర్‌డీఏ, ఆంధ్ర యూనివర్సిటీ, సర్క్యూట్ గెస్ట్‌హౌస్ వైపు వెళ్లే ప్రధాన సర్కిల్‌ను సుందరంగా తీర్చిదిద్దాల్సిన జీవీఎంసీ అధికారులు దీని నిర్వహణను సీరియస్‌గా తీసుకోవటంలేదని పరిసర దుకాణదారులు అంటున్నారు. సర్కిల్‌లో మద్యం తాగి సీసాలు పడేస్తున్నారు. రాత్రి వేళ ఆకతాయిలు మద్యం తాగుతున్నారని దుకాణదారులు చెబుతున్నారు. ఇలాంటి వాటిపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

టీడీపీ 15వ వార్డు నూతన కార్యవర్గం


నూతన అధ్యక్షునికి, ప్రభుత్వ ప్లీడర్‌కు సత్కారం

వెంకోజీపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ 15వ వార్డు నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. పాత వెంకోజీపాలెం జంక్షన్ వద్ద జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్‌కు వార్డు టీడీపీ అధ్యక్ష పదవి లభించింది. ఇప్పటివరకు వార్డు బీసీ సెల్ అధ్యక్షునిగా ఉన్న బోను సూరిబాబుకు ఉపాధ్యక్ష పదవి దక్కింది. కార్యదర్శిగా కె.మహేష్, బీసీ సెల్ అధ్యక్షునిగా సంపంగి సురేష్, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా కణితి నాగరాజు, తెలుగు యువత అధ్యక్షునిగా బుగత జ్ఞాన సాయిదీప్, కార్యదర్శిగా ఆదినారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.ఇప్పటివరకు వార్డు అధ్యక్షునిగా పదహారేళ్లుగా చేసిన బుగత సత్యనారాయణకు ప్రభుత్వ ప్లీడర్‌గా అవకాశం ఇవ్వడంతో వార్డు టీడీపీ నాయకులు ఆయనను సత్కరించారు. నూతనంగా ఎన్నికైన వార్డు అధ్యక్షుడు మళ్ల రవికుమార్‌ను పలువురు నాయకులు సత్కరించారు. తమ సంఘ సభ్యునికి పదవులు లభించడం ఆనందంగా ఉందని సంతోషిస్తూ సీతారామ సేవా సంఘం వారు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవిద్య, నాయకులు ధనరెడ్డి, శంకర్, గిరిబాబు, పలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


గంధం శ్రీనివాసరావు తల్లి సరోజని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గంధం శ్రీనివాసరావు తల్లికి నివాళి

పెదగంట్యాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు తల్లి సరోజని సంస్మరణ సభను ఆదివారం బీసీ రోడ్డులో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సతీమణి, ఏయూ ప్రొఫెసర్ ఆచార్య పల్లా లావణ్య, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు, టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు, తదితరులు విచ్చేసి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బీఎన్ పాత్రుడు, బొండా జగన్, మొల్లి ముత్యాలనాయుడు, కార్మిక సంఘాల నాయకుడు మంత్రి రాజశేఖర్, పలు కాలనీల అసోసియేషన్ల నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సరోజని చిత్రపటం వద్ద అంజలి ఘటించారు.

నేడు వీఎంఆర్‌డీఏలో ప్రజా దర్బార్

సిరిపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం వీఎంఆర్‌డీఏలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. తాను కూడా హాజరవుతానని తెలిపారు. వీఎంఆర్‌డీఏకు సంబంధించిన అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసం ప్రజానీకం వినతులు అందజేయవచ్చన్నారు. వాటిని సంబంధిత విభాగాలతో సమీక్షించి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వీఎంఆర్‌డీఏకు సంబంధించిన సమస్యలపై నేరుగా తనకు వినతి పత్రాలు అందజేయవచ్చన్నారు.

అనుపమ మోహన్‌కు చిన్నసత్యం జీవన సాఫల్య పురస్కారం


అనుపమ మోహన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి


కళాకారుల నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం కూచిపూడి కళాక్షేత్ర, విశాఖ ఆర్ట్ అండ్ డాన్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన వెంపటి చిన్న సత్యం 96వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి డాక్టర్ అనుపమ మోహన్‌కు వెంపటి చిన్నసత్యం జీవన సాఫల్య (లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు) పురస్కారాన్ని ముఖ్య అతిథులు, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా ప్రదానం చేశారు. వెంపటి చిన్న సత్యం పేరిట వింజరపు జగన్నాథరావు, ఎన్.ఎన్.వి.సత్యభామలకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించారు. అనంతరం శ్రియశ్రీరామ్, సంతోషి విజయ్‌ల భరతనాట్యం ప్రేక్షకులను కనువిందు చేసింది. డాక్టర్ క్రీత కరుణి కథక్ నృత్యంతో ఆకట్టుకుంది. నేహా వర్మ ప్రదర్శించిన ఒడిస్సీ నృత్యానికి చప్పట్లు మారుమోగాయి. నాట్య గురువులు అరుణ్ సాయికుమార్, లలిత్‌కుమార్, శ్రీదేవి, హరిరామ్మూర్తి శిష్య బృందాలు ప్రదర్శించిన హిందోళం తెల్లాన, గిరిజా కల్యాణం నిత్య రూపకం, దశావతారాలు రూపకం, గజవదన, వసంత తదితర ప్రదర్శనలు ఆద్యంతం రక్తికట్టించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ మిత్ర, వాడా ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణరావు, ఫెస్టివల్ కో-ఆర్డినేటర్లు మంజూష, సింధుజ, మహాలక్ష్మి, కల్యాణి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న మంత్రి లోకేశ్

మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం


మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే వెలగపూడి

గోపాలపట్నం, ఎంవీపీ కాలనీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగర పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు స్వాగతం పలికారు. అలాగే తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కూడా లోకేశ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.

గంటా రవితేజ కృతజ్ఞతలు

విశాఖపట్నం : విశాఖ ఐటీని ప్రపంచ వ్యాపితం చేసిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు యువ నాయకుడు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి లోకేశ్‌ను రవితేజ విశాఖ ఎయిర్ పోర్టులో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా విశాఖ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని ప్రస్తావించారు. రూ.56వేల కోట్లతో గూగుల్ డేటా సెంటర్, రూ. 85వేల కోట్లతో రైడెన్ డేటా సెంటర్, రూ. 16వేల కోట్లతో సిఫీ డేటా సెంటర్, ఏర్పాటయ్యేలా చేసినందుకు మంత్రికి అభినందనలు తెలిపారు. త్వరలో ఏర్పాటు కానున్న టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు వేలాది మంది యువకులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తాయని పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ సింహాద్రిపురంలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. సహజీవంలో విభేదాల కారణంగా ఆమె ఉరేసుకుని మృతిచెందినట్లు తండ్రి పూడి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఖాదర్ బాషా తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా మెంటాడ మండలం పెద మేడపల్లి ప్రాంతానికి చెందిన పూడి లిఖిత (20) ఇంటర్మీడియట్ పూర్తిచేసి, నర్సింగ్ కోర్సు చేయడానికి విశాఖకు ఈఏడాది ఏప్రిల్‌లో వచ్చింది. ఆమె పెద చామలాపల్లి ప్రాంతానికి చెందిన రాయి నాగరాజుతో సింహాద్రిపురంలో సహజీవనం చేస్తోంది. నర్సింగ్ కోర్సు కూడా మానేసింది. సహ జీవనంలో తరచూ వీరిద్దరూ గొడవపడేవారు. ఈనెల 10న నాగరాజు లిఖితతో గొడవపడి, బయటకు వెళ్లిపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురైన లిఖిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం శనివారం బయట పడడంతో యువతి తండ్రి వెంకటరమణ ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సహజీవనం చేసిన రాయి నాగరాజు ప్రోద్బలం వల్లే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో ఆరోపించారు.

ఐదో అంతస్థు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వెంకోజీపాలెం మెడికవర్ ఆసుపత్రి అయిదో అంతస్థు నుంచి పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆదిరాజు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా అలుపడార్, కోటపడ, కెండెగుడ గ్రామానికి చెందిన నరసింగి పూజారి(28) వారి గ్రామంలో పూజారిగా ఉండేవాడు. మద్యానికి బానిస కావడంతో ఇటీవల అతడిని విధుల నుంచి ఆలయ కమిటీ తొలగించింది. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగ్గాలేదు. వెంకోజీపాలెం మెడికవర్ ఆసుపత్రిలో అనారోగ్యంతో ఉన్న తన స్నేహితుని తల్లిని చూడటానికి స్నేహితుడితో పాటు శుక్రవారం వచ్చాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో స్నేహితుడు తులసీదాస్ నరసింగి పూజారి భార్య పున్ని పూజారికి ఫోన్ చేసి, నరసింగి పూజారి మద్యం తాగి ఎటో వెళ్లిపోయాడని, కనిపించలేదని చెప్పాడు. రాత్రి పదిన్నర సమయంలో ఓ వ్యక్తి మెడికవర్ ఆసుపత్రి అయిదో అంతస్తు నుంచి పడిపోయాడని సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి, వెంటనే ఎమెర్జెన్సీ వార్డుకు తరలించారు. అప్పటికే నరసింగి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నరసింగి భార్య పున్నీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వెంకోజీపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్ర గాయాలపాలై, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎంవీపీ కాలనీ ఏఎస్ఐ జి.సత్యం తెలిపిన వివరాల మేరకు.. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో విశాలాక్షినగర్ రామాలయం వీధికి చెందిన కొలిచిన అన్నపూర్ణ (55) వెంకోజీపాలెం జాతీయ రహదారిని దాటుతుండగా స్కూటీపై ముగ్గురు మద్యం మత్తులో ప్రయాణిస్తూ ఆమెను ఢీకొట్టారు. తలకు తీవ్ర గాయాల వడంతో వెంటనే సమీపంలోని ఆసుపత్రికి, తర్వాత కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. ఆమె కుమారుడు సాయిభరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధి ఇసుకతోట రామాలయం వీధికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సూరిశెట్టి వినయ్ పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. తన తల్లి సూరిశెట్టి లలిత(42), తండ్రి ఈ నెల 3న తగవులాడుకున్నారని, నాలుగో తేదీన మధ్యాహ్నం తన తల్లి ఒక బ్యాగు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయిందని పేర్కొన్నాడు. వివిధ ప్రాంతాల్లో ఆచూకీ కోసం ప్రయత్నించగా, అదే రోజు సాయంత్రం నాలుగున్నర సమయంలో నెంబరు 255లో నర్సీపట్నం బస్సు ఎక్కినట్లు తెలిసిందని, తర్వాత ఎంత ప్రయత్నించినా ఆమె ఆచూకీ తెలియరాలేదని తెలిపాడు. సీఐ కేఎన్ఎస్వీ ప్రసాద్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ నూకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణ కష్టాలు

ఆరిలోవ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాతడైరీ ఫారం వద్ద బస్సుల కోసం మహిళలు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. బస్సులన్నీ రద్దీగా ఉండడంతో ప్రయాణించలేకపోతున్నామని వాపోతున్నారు. ఆదివారం సుమారు గంటసేపు ఇక్కడ వేచి ఉండాల్సి వచ్చిందని వారు తెలిపారు. వివాహాల జోరు, సెలవుదినం కావడంతో బస్సులు దొరకలేదని అంటున్నారు. బస్సుల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.

స్తంభించిన ట్రాఫిక్


మసీదు జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద నిలిచిన వాహనాలు

ఆరిలోవ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేలీస్కూలు సమీపంలోని మసీదు జంక్షను సిగ్నల్ పాయింట్ వద్ద ఆదివారం పలు వాహనాలు నిలిచిపోయాయి. దీనితో ట్రాఫిక్ స్తంభించింది. మధురవాడలోని ఏసీఏ వీసీడీఏ స్టేడియంలో మహిళల ప్రపంచ కప్ క్రికెట్ పోటీ తిలకించడానికి అధిక సంఖ్యలో నగరం నుంచి కుటుంబ సమేతంగా తరలి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ కూడలిలో వాహనాలు నిలిచిపోయాయి. ఆదివారం కావడంతో క్రికెట్ పోటీ చూసేందుకు అధిక సంఖ్యలో వెళ్లారు. వాహనాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ముందుకు కదల్లేదు.

ఇది రోడ్డా.. వ్యర్థాల గుట్టా?



అక్కయ్యపాలెం-తాటిచెట్లపాలెం మధ్య 80 అడుగుల రోడ్డులో వేసిన డెబ్రిస్

▸▸ దుర్గంధభరితంగా అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డు

విశాఖపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలో మహారాణిపార్లర్ జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్లే 80 అడుగుల రోడ్డు పలుచోట్ల అధ్వాన్నంగా తయారైంది. కేంద్రీయ విద్యాలయం క్వార్టర్స్ సమీపంలో ఉన్న రోడ్డు భవన నిర్మాణ వ్యర్థాల (డెబ్రిస్) గుట్టలతో అపరిశుభ్రంగా మారింది. అక్కయ్యపాలెం పరిసరాల్లో ఇళ్ల నిర్మాణ సమయంలో వచ్చిన వ్యర్థాలను కాంట్రాక్టర్లు నగర శివారు ప్రాంతాల్లో పారబోయకుండా దగ్గరగా ఉన్న 80 అడుగుల రోడ్డులో గుట్టలుగా పోస్తున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు, దానికి ఆనుకుని ఫుట్‌పాత్ డెబ్రిస్‌తో నిండిపోయింది. ఇటీవల అమృత పథకం కింద నీటి పైపుల నిర్మాణానికి రోడ్డుకు ఆనుకుని తవ్విన గోతులు సరిగ్గా పూడ్చనందున వర్షపునీరు నిల్వ ఉండిపోయింది. దీంతో దోమలు, ఈగలు చేరి ఈ ప్రాంతంలో దుర్గంధం వ్యాపించడంతో పాదచారులు, ప్రధానంగా సెంట్రల్‌స్కూలు వెనుక గేటు నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఒకప్పుడు సుందరంగా కనిపించే రోడ్డు ఇటీవల అధ్వానంగా మారిందని పాదచారులు వ్యాఖ్యానిస్తున్నారు. జీవీఎంసీ శానిటరీ, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికలో కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో 80 అడుగుల రోడ్డు దుస్థితికి చేరిందంటున్నారు.

బడ్డీలు మళ్లీ ప్రత్యక్షం

అక్కయ్యపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం ఎనభై అడుగుల రోడ్డులో ఇటీవల తొలగించిన బడ్డీలు మళ్లీ ప్రత్యక్షమయ్యాయి. స్మార్ట్ సిటీలో భాగంగా కొద్ది రోజుల క్రితం జీవీఎంసీ అధికారులు, సచివాలయాల సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించారు. కానీ కొద్దిరోజుల్లోనే వాటిని నిర్వాహకులు యథాస్థానంలో పెట్టారు. దీని వల్ల మళ్లీ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. తొలగించిన బడ్డీలను మళ్లీ ఏర్పాటు చేయడంతో వారు అధికారులను సైతం పట్టించుకోవడం లేదని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీలు జీవీఎంసీ అధికారులకు కనిపించాయో, లేదో, తెలియడం లేదని పలువురు అంటున్నారు.



రోడ్డు పక్కన పార్కింగ్ చేసి వాహనాలు



ఎనభై అడుగుల రోడ్డులో ఏర్పాటు చేసిన బడ్డీలు

సృజనాత్మకతను బయటకు తీయాలి

సీతంపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు కథలు, విషయ పరిశీలనతో ఊహాత్మక ఆలోచనలు రేకెత్తించడం ద్వారా వారిలో సృజనాత్మక శక్తిని పెంచవచ్చని వాయిస్ ఆర్టిస్ట్ ఎం.సీతాశ్రీనివాస్ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్, గ్రంథాలయ సొసైటీ సంయుక్తంగా ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కథ వినడం మాత్రమే కాకుండా పిల్లలతో పాటలు పాడించడం, పక్షుల గూళ్లను పరిశీలించడం వంటివి చేయించారు. గ్రంథాలయ సొసైటీ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.వర్మ ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

తీరానికి.. తాటి కవచం!

... 5వ పేజీ తరువాయి

పెరుగుతాయి. తుఫాన్‌గాలులను నిలువరిస్తాయి. గతంలో దివిసీమ తుఫాన్ తరువాత కోస్తాతీరం వెంబడి భారీగా తాటి, సరుగుడు వనాలు పెంచారు. ఆ తరువాత రెండోవరుసలో సరుగుడు వనాలు పెంచనున్నారు. ఈ ఏడాది 20 లక్షల సరుగుడు మొక్కలు నాటాలని అటవీశాఖ నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి 30 నుంచి 40 లక్షల సరుగుడు మొక్కలు నాటుతారు. ఆ తరువాతి వరుసలో రైతుల భూముల్లో జీడితోటల పెంపకాన్ని ప్రోత్సహించనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో అనువుగా ఉండే చోట మడ అడవులు పెంచుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పలు పథకాల ద్వారా తాటి, సరుగుడు, మడ అడవులు పెంపకం చేపడతారు. కోస్తా తీరం మొత్తం ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు అమలుకు రూ.500 కోట్లు వెచ్చించనున్నారు.

నిధులు వెనక్కి

... 5వ పేజీ తరువాయి

అప్పట్లోనే గుర్తించారు. నాడు-నేడు తొలిదశ పనులకు చకాచకా నిధులు కేటాయించిన అప్పటి ప్రభుత్వం, రెండో దశపై పూర్తి నిర్లక్ష్యాన్ని చూపింది. దీనివల్ల చాలా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. ఇతరత్రా వసతులు కూడా అందుబాటులోకి రాలేదు. లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, ప్రహరీల పనులు సగంలోనే ఆగిపోయాయి. కొన్నిచోట్ల అదనపు గదుల నిర్మాణాలు పూర్తైనా వాటికి తలుపులు, కిటికీలను ఏర్పాటు చేయలేదు. భవనాలకు రంగులు వేయలేదు. ఈలోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకానికి 'మన బడి-మన భవిష్యతు'గా పేరు మార్చి పనుల పూర్తికి నిధులు కోరడంతో జిల్లాకు రూ.30 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఈ నిధులతో పాటు మెటీరియల్ సరఫరా చేయాలని కోరారు. మరోపక్క అసంపూర్తి పనులు చేపట్టాలని పాఠశాల అభివృద్ధి కమిటీలు జిల్లా విద్యాశాఖను ఏడాదిగా కోరుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా తొలివిడత రూ.13 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలలో వచ్చిన నిధులను వెనక్కి పంపించేశారు. జిల్లాలో విద్యార్థులు ఎక్కువగా ఉండి అరకొర వసతులు ఉన్న చంద్రంపాలెం, తోటగరువు, సునీల్‌శర్మ కాలనీ ఉన్నత పాఠశాలల్లో ఇబ్బందులు నెలకొన్నాయి. ఇప్పటికే స్లాబులు వేసి తలుపులు, కిటికీలు బిగించడం, సున్నాలు వేసి విద్యుత్ సరఫరాకు వీలుగా నిధులిస్తే పలు పాఠశాలల్లో అదనపు గదులు అందుబాటులోకి వస్తాయని పాఠశాల అభివృద్ధి కమిటీలు కోరుతున్నాయి. దీనిపై మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

ప్రతికా, స్మృతి పోరు వృథా!

... 5వ పేజీ తరువాయి

అలిస్సా హిలి భారీ సెంచరీతో (142) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి తమ ఖాతాలో మరో విజయాన్ని నమోదు చేసింది. భారత్‌పై దక్షిణాఫ్రికా చివరిగా సిక్సర్ కొట్టి గెలుపొందగా...ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కూడా ఆస్ట్రేలియా సిక్సర్‌తోనే విజయం సాధించడం విశేషం.

చెలరేగిన స్మృతి మంధాన, ప్రతికా రావల్

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ప్రతికా రావల్ (75), స్మృతి మంధాన (80) చెలరేగారు. ఎనిమిదో ఓవర్లో సోఫీ బౌలింగ్‌లో స్మృతి మంధాన స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీ, లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, మిడ్ వికెట్ మీదుగా మరో బౌండరీ బాది స్కోరు బోర్డును పరిగెత్తించింది. అదే ఓవర్లో స్క్వేర్ లెగ్ వద్ద అవుట్ నుంచి తప్పించుకుంది. తొమ్మిదో ఓవర్‌లో గార్డనర్ బౌలింగ్‌లో మరో ఓపెనర్ ప్రతికా రావాల్ లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, మిడాఫ్ మీదుగా బౌండరీ కొట్టి ఆసీస్ బౌలర్లను బెంబేలెత్తించింది. స్మృతి మంధాన 46 బంతుల్లో 7 బౌండరీలు, ఒక సిక్సర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేయగా..ప్రతికా రావల్ 69 బంతుల్లో 7 బౌండరీలు, ఒక సిక్సర్‌తో హాఫ్ సెంచరీ సాధించింది.

నాలుగు ఓవర్లలో ఐదు వికెట్లు

భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్ మహిళలు అనవసర షాట్‌లకు ప్రయత్నించి వికెట్లు పోగొట్టుకున్నారు. ఫలితంగా మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే, 48.5 ఓవర్లకు ఆలౌటయ్యారు. వికెట్ల ముందు సెటల్ అయిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (22), రోడ్రిగస్ (33), రిచా ఘోష్ (32) అనవసర షాట్‌లతో వికెట్లు సమర్పించుకున్నారు. నాలుగు ఓవర్లలో వరుసగా ఐదు వికెట్లు పోగొట్టుకోవడం ప్రేక్షకులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

సెంచరీతో హిలి కెప్టెన్ ఇన్నింగ్స్

ఆస్ట్రేలియా ఓపెనర్ అలిస్సా హిలి సెంచరీతో (142) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి భారత్ ఆశలపై నీళ్లు చల్లింది. మరో ఓపెనర్ లిచ్ ఫీల్డ్ (40) రాణించడంతో 15 ఓవర్లలోనే వంద పరుగులు పూర్తిచేసిన ఆస్ట్రేలియా దీటైనా జవాబు ఇచ్చేలా దూసుకుపోయింది. లిచ్ ఫీల్డ్ స్థానంలో దిగిన పెర్నీ (47; రిటైర్డ్ హర్ట్) క్రీజులో ఉన్నంతసేపు భారత్ మ్యాచ్‌పై పట్టు సాధించలేకపోయింది. అలిస్సా హిలి 84 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్సర్‌తో సెంచరీ పూర్తిచేసి పటిష్ట స్థితికి చేర్చింది. తర్వాత వచ్చిన ఆసీస్ బ్యాటర్లను భారత్ బౌలర్లు కట్టడి చేయడంలో విఫలమయ్యారు. సెకెండ్ స్పెల్‌లో అమన్‌జోత్ కౌర్ అద్భుత బౌలింగ్‌తో ఆస్ట్రేలియా బ్యాటర్లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. రిటైర్డ్ హర్ట్ అయిన పెర్రీ తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి స్నేహ రానా బౌలింగ్‌లో లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్ బాదడంతో ఆస్ట్రేలియా 49 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది.

అభా.. కదలదేంటబ్బా!

... 5వ పేజీ తరువాయి

ఇప్పటికే హెల్త్ ఐడీని క్రియేట్ చేశారు. రెండేళ్లుగా ఈ కార్యక్రమం పెద్దఎత్తున సాగుతోంది. జిల్లాలో సుమారు 22 లక్షల మంది ప్రజలకు అభా హెల్త్ అకౌంట్ ఓపెన్ చేసి ఐడీ నంబరు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 18 లక్షల మందికి హెల్త్ ఐడీ నంబర్లను క్రియేట్ చేశారు. మరో 4.15 లక్షల మందికి సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగడంలేదు. రిజిస్ట్రేషన్ చేయించుకోని వారంతా అపార్ట్ మెంట్లు, గ్రూప్‌హౌస్‌ల్లో ఉంటున్న వారే కావడం గమనార్హం. అభా హెల్త్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసేందుకు వచ్చే ఆరోగ్య సిబ్బందిని అనుమతించకపోవడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. ఆయా ప్రాంతాలకు చెందిన ఏఎన్ఎం, ఇతర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అభా ఐడీ యాప్‌లో సదరు వ్యక్తి ఆధార్ నంబరును ఎంటర్ చేయాల్సి ఉంటుంది. వెంటనే అతని ఫోన్ నంబరుకు ఓటీపీ వెళ్తుంది. ఆ ఓటీపీ చెబితేనే అభా ఐడీ క్రియేట్ అవుతుంది. ఆ తరువాత హెల్త్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకునేందుకు అవకాశం ఉంది.

ఓటీపీతోనే సమస్య

అయితే అనేక చోట్ల ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడానికి ప్రధాన కారణం సిబ్బందికి ఓటీపీ చెప్పాల్సి రావడమేనని అధికారులు చెబుతున్నారు. ఓటీపీ చెబితే డబ్బులు పోతాయనే భయంతో ఆరోగ్య సిబ్బందికి చాలామంది సహకరించడంలేదు. కొన్నిచోట్ల గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్ వాసులు సిబ్బందిని లోపలికి వచ్చేందుకు కూడా అనుమతించడంలేదు. ఈ ప్రక్రియ చేపడుతున్న ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ సూచించినా ప్రయోజనం కనిపించడంలేదని అధికారులు చెబుతున్నారు. దీనిపై ప్రజలు ఆలోచించాలని, ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరుతున్నారు. కొన్ని నెలలుగా ప్రక్రియ ముందుకు కదలడం లేదన్నారు. ప్రజలు సహకరిస్తేనే హెల్త్ ఐడీ నమోదు ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

ఐడీ నంబరుతో ఎంతో మేలు

అభా ఐడీతో కూడిన హెల్త్‌కార్డులు పొందడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఈ నంబరు కలిగి ఉంటే దేశంలోని ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగికి సంబంధించిన రిపోర్టులు, ఇతర వివరాలు తమ వెంట తీసుకువెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ వివరాలన్నింటినీ డిజిటల్ పద్ధతిలో ఈ అకౌంట్‌లో స్టోర్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. దేశంలోని ఏ ఆస్పత్రికి వెళ్లినా నంబరు నమోదు చేయగానే రోగికి సంబంధించిన ఆరోగ్య చరిత్ర డిస్‌ప్లే అవుతుంది. వెంటనే వైద్యులు తదుపరి పరీక్షలు, ఇతర వైద్య సేవలను అందించేందుకు వీలుంటుంది. పేపర్‌లెస్ వైద్య విధానాన్ని అందించేందుకు హెల్త్ ఐడీ దోహదపడుతుదని అధికారులు వివరిస్తున్నారు.

భారత బాక్సింగ్ కోచ్‌ల కమిషన్ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు



విశాఖపట్నం స్పోర్ట్స్ అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భారత బాక్సింగ్ కోచ్‌ల కమిషన్ చైర్మన్‌గా నగరానికి చెందిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇనుకుర్తి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఆదివారం హర్యానాలోని బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వెంకటేశ్వరరావును కోచెస్ కమిషన్ చైర్మన్‌గా నియమిస్తూ తీర్మానం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా బాక్సింగ్ క్రీడారంగానికి సేవలందిస్తున్న వెంకటేశ్వరరావుకు కేంద్ర ప్రభుత్వం 2011లో ద్రోణాచార్య అవార్డుతో సత్కరించింది. బాక్సింగ్ క్రీడలో అంతర్జాతీయ ప్రామాణికత కలిగిన ఎన్‌టీవో డ్రా కమిషనర్‌గా అర్హత సాధించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ సంఘం అధ్యక్షునిగా కొనసాగుతున్న వెంకటేశ్వరరావును....భారత బాక్సింగ్ కోచ్‌ల కమిషన్ చైర్మన్‌గా నియమించడం, ఎన్‌టీవో డ్రా కమిషనర్‌గా అర్హత సాధించడంపై పలువురు హర్షం ప్రకటించారు.

ఉచిత సేవలు స్ఫూర్తిదాయకం

▸▸ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి



విజేత జట్టుతో నగర సీపీ శంఖబ్రత బాగ్చి

డాబాగార్డెన్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రోజుల్లో ఉచితంగా సేవలందించడం ఎంతో స్ఫూర్తిదాయకమని నగర సీపీ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లోని పుట్టా మన్మథరావు స్మారక క్లబ్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోచ్ అన్నెపు రామచంద్రరావు రెండు దశాబ్దాలుగా బాస్కెట్‌బాల్ క్రీడా రంగంలో ఉచితంగా చిన్నారులకు శిక్షణ ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. జీవితంలో ఆశయం ఉంటే సరిపోదని, కష్టపడి దానిని సాధించేందుకు నిరంతరం సాధన చేయాలన్నారు. చదువు, క్రీడలకు పేదరికం అడ్డురాకూడదని, సంకల్పం ఎంతో గొప్పదన్నారు. కోచ్ అన్నెపు రామచంద్ర మాట్లాడుతూ తాను ఉచితంగా బాస్కెట్‌బాల్ క్రీడ నేర్చుకున్నానని, అదే విధానాన్ని తన చివరి శ్వాస వరకు పాటిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ ఎం.పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అర్చరీ సంఘం అధ్యక్షురాలిగా నందమూరి తేజశ్వని



నూతన కార్యవర్గం

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విలువిద్య (అర్చరీ) అసోసియేషన్ నూతన అధ్యక్షురాలిగా నందమూరి తేజశ్వని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఆదివారం ఇక్కడి హోటల్‌లో జరిగిన నూతన కార్యకర్గ ఎన్నికలలో ప్రధాన కార్యదర్శిగా బెవర వెంకటరమణ, కోశాధికారిగా చెరుకూరి కృష్ణకుమారి ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులుగా గొట్టిపాటి ప్రేమ్‌కుమార్, బొమ్మదేవర శ్రావణ్‌కుమార్, కె.నాగరత్నమయ్య, పి.వి.రమణ, సహాయ కార్యదర్శులుగా డి.టి.గాంధీ, టి.శివప్రసాద్, మహ్మద్ అంజాద్ అలీ, పి.వేణు, ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా చెరుకూరి సత్యనారాయణ, చీఫ్ పాట్రన్స్‌గా పి.సత్యనారాయణ, వీవీఎస్.జనార్ధనరెడ్డి నియమితులయ్యారు. నేషనల్ స్పోర్ట్సు కోడ్ నిబంధనలకు అనుగుణంగా జరిగిన ఈ ఎన్నికలకు అర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి పి.అరవింద్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ నుంచి ఎస్.వెంకటేశ్వరరావు పరిశీలకులుగా వ్యవహరించగా, న్యాయవాదులు కె.ఎస్.సురేష్‌కుమార్, పి.రాజశేఖర్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

మహిళల కబడ్డీ విజేత ప్రగతి కళాశాల



విజేత క్రీడాకారిణులతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ టోర్నీలో ప్రగతి వ్యాయామ కళాశాల చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. విశాఖ మహిళా ప్రభుత్వ కళాశాల ద్వితీయ స్థానం, చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయి. ఆదివారం ఏయూ జిమ్నాజియం ఇండోర్ హాల్లో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ మాజీ ఉపకులపతి ఆచార్య బీల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, ఐఐపీఈ స్పోర్ట్సు ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఫిజికల్ డైరక్టర్లు రాజేష్, రామలక్ష్మి, ఫ్యాకల్టీ డాక్టర్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళలతో మానసిక ప్రశాంతత

డాబాగార్డెన్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతను అందించే కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలోని జగన్నాత కళా సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. కళారంగ ప్రముఖులు మేడా మస్తాన్‌రెడ్డి, వర్రె నాంచారయ్య, దండు నాగేశ్వరరావు, బొమ్మిడి సత్యనారాయణ ఎస్.ఎస్.నాయుడులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు నేటి తరానికి అందించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రాచీన సంప్రదాయ కళాకారులను గౌరవించుకోవాలని సూచించారు. జగన్నాథ కళా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వి.చిన్నారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వివిధ కళల్లో ప్రతిభ ప్రదర్శించిన వారిని సత్కరించారు.

నిధుల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

అంచనా మేరకు సుమారు రూ. 10 కోట్ల మేర స్టాంపుడ్యూటీ వాటా పంచాయతీలకు రావాల్సి ఉంది.

పంచాయతీలకు గ్రేడ్లు

ఇటీవల గ్రామ పంచాయతీలకు గ్రేడ్లు ప్రకటించిన నేపథ్యంలో ఆదాయ వ్యయాలను అధికారులు నిర్ధారించారు. అంటే సాధారణ నిధులు, కేంద్రం విడుదలచేసే ఆర్థిక సంఘం నిధులు, ఇంటి పన్నులు, వాణిజ్య సముదాయాలు, సంతల ద్వారా వచ్చే ఆదాయంతోపాటు స్టాంపుడ్యూటీ బకాయిలను పరిగణనలోకి తీసుకున్నారు. ఆదాయ ఆర్జన మేరకు పంచాయతీలకు గ్రేడింగ్ ఇచ్చారు. జిల్లాలో ఎక్కువ పంచాయతీలకు గ్రేడ్ 1,2.. ఇలా పలు హోదాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రూ .10 కోట్ల వరకు స్టాంపుడ్యూటీ వాటా రావాల్సి ఉంటుందని సమాచారం. పంచాయతీల విస్తరణలో భాగంగా చాలా గ్రామాల్లో కొత్తగా కాలనీలు, నివాసాలు వస్తున్నాయి. దీంతో వసతులు ముఖ్యంగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, తాగునీటా సరఫరా, విద్యుత్ లైన్ల ఏర్పాటు, పారిశుధ్యం నిర్వహణ చేపడుతున్నారు. దీనికి నిధులు అవసరమని సర్పంచ్‌లు చెబుతున్నారు. ఆర్థిక సంఘం నిధులు సరిపోవడంలేదని స్టాంపుడ్యూటీ వాటా విడుదల చేయాలని గంభీరం సర్పంచ్ వానపల్లి లక్ష్మి కోరారు. గత ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదలచేస్తే మౌలిక వసతులు కల్పిస్తామంటున్నారు.

త్వరలో వినియోగంలోకి రుషికొండ ప్యాలెస్

... 5వ పేజీ తరువాయి

బయటపడ్డాయి. విలువైన భవనాన్ని ఖాళీగా ఉంచకుండా పర్యాటక సీజన్ నాటికి ఏదో ఒక విధంగా ఉపయోగంలోకి తేవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మూడు నెలల తరువాత కమిటీ రెండు రోజుల క్రితం విజయవాడలో సమావేశమై ప్యాలెస్ వినియోగంపై చర్చించింది. దీనిపై ప్రజలతో పాటు జాతీయ, అంతర్జాతీయ ఆతిథ్య సంస్థల నుంచి సూచనలు తీసుకోవాలని అభిప్రాయపడింది. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక సంస్థ ఆదివారం ప్రకటన జారీ చేసింది. రుషికొండ ప్యాలెస్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న తొమ్మిది ఎకరాల భూమిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో వారం రోజుల్లోగా అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. సూచనలను ఏపీ టూరిజం వెబ్‌సైట్‌కు పంపాలని సూచించింది. దాంతో పాటు ఈ నెల 17వ తేదీన విజయవాడ ఆటోనగర్‌లోని పర్యాటక శాఖ సీఈఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తామని, దానికి జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు హాజరై సూచనలు ఇవ్వాలని కోరింది.

విశాఖే ఆర్థిక రాజధాని

... 5వ పేజీ తరువాయి

కట్టారన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారని, అప్పుడు కూడా తెల్లవారుజామున మూడు గంటలకు నిద్ర లేచి మూడు లక్షల మంది బీచ్‌కు తరలివచ్చారని గుర్తు చేశారు. విశాఖపట్నాన్ని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా చేస్తామన్నారు. ఐటీలో హైదరాబాద్ 30 ఏళ్లకు అభివృద్ధి సాధిస్తే.. అదే అభివృద్ధిని ఇక్కడ పదేళ్లలో సాధించాలని ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు.

సమీక్ష సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఏపీ కోఆపరేటివ్ గ్రోవర్స్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు స్వప్నిల్ దినకర్ పుండర్కర్, రామసుందరరెడ్డి, ఎంఎన్ హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, విశాఖ జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, వీఎంఆర్‌డీఏ సీయూపీ శిల్ప ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్టీ ఉన్నతికి శ్రమించేవారికి పదవులు: సీతంరాజు సుధాకర్



టీడీపీలో చేరినవారిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎన్టీఆర్ వైద్యసేవ సంస్థ చైర్మన్ సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి పదవిని మంత్రి నారా లోకేశ్ చేపట్టేంతవరకు ప్రతీ కార్యకర్త నిద్రపోకుండా తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఆ పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎన్టీఆర్ వైద్య సేవ సంస్థ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పిలుపునిచ్చారు. 29వ వార్డుకు చెందిన ముఖ్య నాయకుడు జె.ఈశ్వరరావు సహా పలు పార్టీలకు చెందిన సుమారు 150 మంది ఆదివారం టీడీపీలో చేరారు. వారందరికీ సుధాకర్ పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మరోసారి టీడీపీ అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా మరో ఐదేళ్ల పదవిలో ఉంటారని, ఆ తరువాత లోకేశ్ ముఖ్యమంత్రి పదవి చేపట్టేందుకు ఇప్పటి నుంచే పార్టీ వర్గాలు కష్టించి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన ఈశ్వరరావుకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తామని, తెలుగుదేశం పార్టీ కోసం శ్రమించే ప్రతీ ఒక్కరికీ పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామని సుధాకర్ హామీ ఇచ్చారు. రానున్న జీవీఎంసీ ఎన్నికలలో పార్టీని విజయపథాన ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యునిగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకుంటామని, అందుకు టీడీపీ శ్రేణులు వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగితే రౌడీషీట్లు మూసేస్తాం: సీఐ జీడీబాబు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న వన్‌టౌన్ సీఐ జి.దేముడు బాబు



నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ ఉమాకాంత్

మహారాణిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగితే వారిపై ఉన్న రౌడీషీట్ మూసేసి, వారి ఉపాధికి పోలీసు శాఖ తరఫున ఊతమిస్తామని వన్‌టౌన్ సీఐ జి.దేముడు బాబు భరోసా ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల ఇళ్లలో శనివారం అర్ధరాత్రి సీఐ జి.దేముడు బాబు పర్యవేక్షణలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వారి ఇళ్లు, ఇతర స్థలాల్లో గంజాయి, మత్తు పదార్థాలు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ఇతర వస్తువులు దాచినట్లయితే స్వాధీనం చేసుకునేందుకు తనిఖీలు చేపట్టామని సీఐ తెలిపారు. ఐదు బృందాలను ఏర్పాటు చేసి పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించటమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. రౌడీషీటర్ల సమగ్ర సమాచారం కూడా తెలుస్తుందన్నారు. నేరాలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదివారం రౌడీషీటర్లను పోలీసు స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అందరితో వ్యక్తిగతంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

హద్దుమీరితే పీడీ చట్టం

సీతంపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హద్దుమీరి ప్రవర్తించే రౌడీషీటర్లపై పీడీ చట్టం ప్రయోగిస్తామని నాలుగో పట్టణ సీఐ ఉమాకాంత్ హెచ్చరించారు. అతిగా వ్యవహరించేవారిని స్థానికంగా ఉండకుండా బయట ప్రాంతాలకు తరలిస్తామని స్పష్టంచేశారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యులతో గడుపుతూ గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.



కోలాటాన్ని ప్రదర్శిస్తున్న మహిళలు

ఆచార సంప్రదాయాలను పరిరక్షించడమే ధ్యేయం

ఆటోనగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆచార సంప్రదాయాలను పరిరక్షించడమే ధ్యేయమని ప్రముఖ కళాకారులు డి.శ్రీలక్ష్మి రంగయ్యనాయుడు పేర్కొన్నారు. 87వ వార్డు తిరుమలనగర్‌లో ఆదివారం అన్నమయ్య కోలాటం సంఘం ఆధ్వర్యంలో కోలాటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ దసరా, వినాయకచవితి, ఆలయ ప్రారంభోత్సవాల్లో కోలాటాను ప్రదర్శిస్తున్నామన్నారు. తమ ప్రదర్శనలను దైవసేవగా భావిస్తామన్నారు.

టీడీపీ గాజువాక వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడిగా మాటూరి రాము



కూర్మన్నపాలెం, అక్టోబరు 12 (ఆంధ్ర జ్యోతి): తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా మాటూరి రాము నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు, రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని నాతయ్యపాలెం కాలనీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆదివారం పరిశీలించారు. నాతయ్యపాలెంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, కాలువలను తిలకించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టరును కోరారు. ఆయన వెంట నాయకులు సంద్రాన వరహాలరాజు, జి.నరసింగరావు, జి.లలిత, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ రాష్ట్ర కోశాధికారిగా రాజారావు



పెదగంట్యాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ రాష్ట్ర శాఖ కోశాధికారిగా పాలగుమ్మి రాజారావు ఎన్నికయ్యారు. గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాల+2లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా పనిచేస్తున్న రాజారావును శనివారం విజయవాడలో జరిగిన ఫోరమ్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. గత పదేళ్లుగా రాజారావు ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

అగనంపూడి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని జరిపించారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 27, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 34, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 36, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 72, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	500
విజయవాడ	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

అభిమానులకు ఫుల్ జోష్

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో పరుగుల వరద



భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌కు హాజరైన అభిమానులు



భారత్ బ్యాటింగ్‌కు అమ్మాయిల ఆనందం



వికెట్ తీసిన ఆనందంలో ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్లు



ప్లకార్డుతో అభిమానం



ప్రతికారావల్, స్మృతి మంధాన బ్యాటింగ్



వికెట్ తీసిన ఆనందంతో శ్రీచరణి

'ఉక్కు' కోక్-ఓవెన్ బ్యాటరీ విభాగంలో స్వల్ప ప్రమాదం



కోక్-ఓవెన్ బ్యాటరీ-5 విభాగంలో చెలరేగిన మంటలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ కోక్-ఓవెన్ బ్యాటరీ-5 విభాగంలో ఆదివారం మధ్యాహ్నం స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. బ్యాటరీ విభాగం-5లో కింద నుంచి పైవరకు కోక్‌ను తీసుకువెళ్లే లాడిల్ పైకి వచ్చేసరికి ఒక్కసారిగా జారిపడిపోయింది. ఆ సమయంలో లాడిల్‌లో ఉన్న కోక్ బ్యాటరీపై పడింది. దీంతో స్వల్పంగా మంటలు చెలరేగాయి. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

జాతీయతే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యం

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పులి లక్ష్మీబాయి



ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న లక్ష్మీబాయి, తదితరులు

పెదగంట్యాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కుల, మత రాజకీయ ప్రమేయం లేకుండా జాతీయతే ప్రధాన లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ ముందుకు సాగుతుందని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పులి లక్ష్మీబాయి అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ శాఖ ఆదివారం నెల్లిముక్కు క్రీడా మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో అంతర్లీనంగా దాగివున్న శక్తిని జాగృతం చేసి క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయతతో తీర్చిదిద్దేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కృషి చేస్తుందన్నారు. పెదగంట్యాడ శాఖ పరిశీలకుడు వీవీఎల్ శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు గొందేశి ఎరుకునాయుడు, వై.అప్పలనాయుడు, జి.గురప్పరెడ్డిలు మాట్లాడుతూ మాతృభూమి కోసం అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమన్న సంకల్పంతో వ్యక్తి నిర్మాణం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందన్నారు. కార్యవర్గ సభ్యులు టేకేటి పెంటయ్య, కిలాని నాయుడు, మునలయ్య, మంత్రి మోహన్‌రావు పట్నాయక్, శ్రీనివాసరావు, త్రినాథ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమాజ బలోపేతమే..

ఆటోనగర్: హిందూ సమాజ బలోపేతమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని బీజేపీ నాయకులు నర్రా శేష ప్రసాద్, బి.వాసు అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్ నుంచి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఆర్‌ఎస్‌ఎస్ విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. దేనంకొండ కృష్ణంరాజు మాట్లాడుతూ హిందూ జాతీయవాద ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ చారిత్రాత్మక పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదన్నారు. నాయకులు శ్రీనివాస్, సంతోశ్, జగదీశ్, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

» పోర్టు అధికారుల నిర్లక్ష్యమే కారణమని ములగాడ వాసుల ఆరోపణ



మృతి చెందిన గర్భంతో ఉన్న ఆవులు. (ఇన్‌సెట్లో) ప్రమాదానికి కారణమైన విద్యుత్ వైరు

మల్కాపురం/సింధియా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మారుతి సర్కిల్ సమీపంలోని రైల్వే గార్డ్ రూమ్ వద్ద శనివారం అర్ధరాత్రి విద్యుదాఘాతానికి గురై గర్భంతో ఉన్న రెండు ఆవులు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. ఇక్కడి రైల్వే గేటు నంబర్-20 వద్ద ట్రాక్ మరమ్మతులకు గురవ్వడంతో పోర్టు అధికారులు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా భూగర్భం నుంచి గార్డ్ రూమ్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే పనులు చేసేందుకు గాను భూమిని తవ్వి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. అయితే తవ్విన గోతిని పూర్తిగా కప్పకుండా వదిలేశారు. అయితే రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ వైరుపై కప్పిన మట్టి అంతా కొట్టుకుపోయి వైరు బయటకు వచ్చేసింది. అదే సమయంలో ములగాడ ఎస్సీ కాలనీలో ఉంటున్న గొటివాడ కన్నారావుకు చెందిన రెండు ఆవులు ఈ మార్గం గుండా వెళుతూ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఆవులు విద్యుదాఘాతానికి గురైన సమయంలో పెద్దగా మంటలు వచ్చాయని ఆ సమయంలో అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. దీంతో పలువురు ఈ మార్గం గుండా ఎటువంటి రాకపోకలు సాగకుండా చర్యలు చేపట్టారు. పోర్టు అధికారుల నిర్లక్ష్యం వల్లే పశువులు మృత్యువాత పడ్డాయని ములగాడ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కూడా ఆలస్యంగా స్పందించారని ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలికి గ్రాంధీ గ్రామ్ పశు వైద్యశాల అధికారి డాక్టర్ సునీల్ చేరుకుని మృతి చెందిన ఆవులకు శవ పంచనామా చేశారు. మృతి చెందిన ఆవులు గర్భంతో ఉన్నాయని తెలుసుకుని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని పశువుల యజమాని కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

» 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న రౌతు శ్రీనివాస్

అగనంపూడి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, అందువల్ల ప్రతిఒక్కరూ రక్తాన్ని దానం చేసి ప్రాణాప్రాయ స్థితిలో ఉన్నవారిని కాపాడాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కోరారు. క్రేన్ ఓనర్స్, ఆపరేటర్స్, టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దానబోయినపాలెం రామాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన క్రేన్ ఓనర్స్, ఆపరేటర్స్, టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. అనంతరం రక్తదాతలకు రౌతు శ్రీనివాస్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ 79వ వార్డు అధ్యక్షుడు కరణం జగదీశ్, నాయకుడు సింగిడి సింహాచలం, నిర్వాహకుడు శరత్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి మంచి స్పందన

స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఎస్ఎన్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన కీళ్లనొప్పులు, చర్మవ్యాధులు సంబంధిత ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. అసోసియేషన్ అధ్యక్షుడు బోసుబాబు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించగా, వైద్యులు ఫణికుమార్, నీతూ చౌదరి, సుజిత్‌లు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సుమారు వందమంది సీనియర్ సిటిజన్స్ వైద్య సేవలు పొందారు. నిర్వాహకులు భాస్కరరాజు, రామునాయుడు, రఫీ, కాళిదాసు, నూకరాజు, అప్పడు, తదితరులు పాల్గొన్నారు.



గంధం శ్రీనివాసరావు తల్లి సరోజని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గంధం శ్రీనివాసరావు తల్లికి నివాళి

పెదగంట్యాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు తల్లి సరోజని సంస్మరణ సభను ఆదివారం బీసీ రోడ్డులో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సతీమణి, ఏయూ ప్రొఫెసర్ ఆచార్య పల్లా లావణ్య, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు, టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు, తదితరులు విచ్చేసి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బీఎస్ పాత్రుడు, బొండా జగన్, మొల్లి ముత్యాలనాయుడు, కార్మిక సంఘాల నాయకుడు మంత్రి రాజశేఖర్, పలు కాలనీల అసోసియేషన్ల నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సరోజని చిత్రపటం వద్ద అంజలి ఘటించారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ కోరారు. ప్లాంట్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలన్నారు. అదేవిధంగా ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు సీనియర్ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

గోపాలపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన ఓ యువకుడు, ఒక బాలుడిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నం క్రైమ్ ఎస్ఐ జి.తేజేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సింహాచలం ప్రాంతంలో జరిగిన ద్విచక్ర వాహనాల చోరీలపై ఈ నెల 6న గోపాలపట్నం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన గుజ్జల నిశాంత్‌రెడ్డి (20), మరో మైనర్ బాలుడు ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించారు. ఈ మేరకు బాలుడిని జువైనల్ హోమ్‌కు, నిందితుడు నిశాంత్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతుడు వెంకటరమణ (ఫైల్)

కూర్మన్నపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 10న కూర్మన్నపాలెం కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వెంకటరమణ (55)ను తొలుత అగనంపూడి ఆస్పత్రికి, ఆ తరువాత కేజీహెచ్‌కు తరలించారు. వెంకట రమణ పదేళ్ల క్రితం ఒడిశా రాష్ట్రం నుంచి బతుకుతెరువు కోసం కూర్మన్నపాలెం వచ్చి కూలి పనులు చేస్తూ కుటుంబంతో ఉంటున్నారు. ఆయనకు భార్య మృతి చెందగా, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు.

'ఉక్కు'పై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు'

గాజువాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విశాఖ ఉక్కు కర్మాగారం గురించి మాట్లాడే అర్హత లేదని ఏపీఐఐసీ డైరెక్టర్, టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన టీఎన్‌టీయూసీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండుసార్లు స్టీల్‌ప్లాంటును ఆదుకున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో నాయకులు కనిరెడ్డి ఆంజనేయ, నమ్మి సింహాద్రి, కె.సోమునాయుడు, నంబారు పెద్ద దేవుడు, బి.సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న నారా లోకేశ్

మంత్రి నారా లోకేశ్‌కు స్వాగతం

గోపాలపట్నం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు ఎమ్మెల్యే పి.గణబాబు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు తదితరులు స్వాగతం పలికారు.

వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని వినతి

విశాఖపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసిస్తూ తాను సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టుకు స్పందించి తన కుటుంబాన్ని ఉద్దేశించి అసభ్యకరంగా పోస్టు పెట్టిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ మీడియా కో-ఆర్డినేటర్ కె.గోపాలరెడ్డి రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం లోకేశ్‌ను ఎయిర్‌పోర్టులో ఆయన కలిసి ఫేక్ ఖాతా ద్వారా తన కుటుంబాన్ని ఉద్దేశించి చేసిన అసభ్య పదజాలంతో చేసిన వ్యాఖ్యలపై సీపీకి ఫిర్యాదు చేస్తే సైబర్ క్రైమ్ సీఐ భవానీప్రసాద్‌కు దర్యాప్తుచేయాలని ఆదేశించారన్నారు. అయితే ఇంతవరకు సదరు వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందువల్ల తక్షణమే విచారణ జరిపి చర్యలు చేపట్టేలా చూడాలని లోకేశ్‌ను కోరారు.

వైసీపీ కోటి సంతకాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

పెందుర్తి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి సంబంధించిన పోస్టరును ఆదివారం మండలంలోని రాంపురంలో గల వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు దంతులూరి దిలీప్‌కుమార్, వైసీపీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం చిన అప్పలనాయుడు, గండి రవికుమార్, కోడిగుడ్ల దేవిసాంబ, మెంటి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

వీవీవీ స్కూల్ ఉపాధ్యాయుల ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయులు, సిబ్బందికి న్యాయం చేయాలని కోరుతూ ప్లాంట్ తెలుగుతల్లి జంక్షన్ వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రోజూ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వీవీవీ స్కూల్‌లోని విద్యార్థులు ఇతర పాఠశాలల్లో చేరిపోయారని, ఉపాధ్యాయులు, సిబ్బందికి అన్యాయం జరిగిందని వాపోయారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని వారన్నారు.

'ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి'

పెదగంట్యాడ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని అంబుజా సిమెంట్ యూనిట్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.రమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. నడుపూరు సీడబ్ల్యూసీలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనావాస ప్రాంతాల్లో కాలుష్య కారక పరిశ్రమలను ఏర్పాటు చేయరాదన్నారు. ఇక్కడ సిమెంటు కంపెనీ ఏర్పాటైతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ సిమెంటు యూనిట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం చేయకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణమూర్తి మాట్లాడుతూ సిమెంటు కంపెనీ ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించుకునేంత వరకు పోరాటం చేయాలన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గాజువాక ఐటీఐలో 3 కొత్త కోర్సులు

గాజువాక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గాజువాకలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ ఏడాది మూడు నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులు కార్పెంటర్, పెయింటింగ్, ప్లంబర్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరవ్వాలని కోరారు.

'ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

కూర్మన్నపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు అన్నారు. వార్డు పరిధిలోని దువ్వాడ సమీప ఇందిరానగర్‌లో ఆదివారం రూ.10 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శత శాతం నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కూటమి నాయకులు, ఉరుకూటి శ్రీనువాస్, ముమ్మిడివరపు రాము, తదితరులు పాల్గొన్నారు.

'వనసేన' ఆధ్వర్యంలో వ్యర్థాల తొలగింపు

మల్కాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): యారాడ సాగరగిరి కనక దుర్గాదేవి ఆలయ పరిసరాల్లో వనసేన ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా వనసేన బృందంతో జేబీసీ బాక్సింగ్ క్లబ్‌కు చెందిన 30 మంది యువత పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో జనసేన 58వ వార్డు అధ్యక్షుడు ముప్పిన ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ ర్యాలీ

కూర్మన్నపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టింగ్‌ను నిషేధించాలంటూ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ కాలనీవాసులు ఆదివారం రైతు బజారులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వద్దు-క్లాత్ సంచులే ముద్దు, కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి, చేపలు, మాంసం మార్కెట్‌లకు వెళ్లేటప్పుడు విధిగా స్టీల్ బాక్సులు, క్లాత్ సంచులను వినియోగించాలని నినాదాలు చేశారు. కొనుగోలుదారులకు క్లాత్ సంచులను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం మాట్లాడుతూ తడి-పొడి చెత్తపై అవగాహన, కాలుష్య నివారణకు మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణకు క్లాత్ సంచులను వినియోగించడం వంటి వాటిలో తమ కాలనీ ప్రజలు ముందుంటారన్నారు. ప్రతినిధులు సన్యాసిరావు, వసంత రెడ్డి, పరమేశ్వరరావు, రాము, కామరాజు, విద్యాసాగర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 90వ వార్డు బాజీ జంక్షన్ సబ్ స్టేషన్‌ను ఆనుకొని ఉన్న పంచతత్వ పార్కులో వాచ్‌మన్ రూమ్, టాయిలెట్ల నిర్మాణానికి ఆదివారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో అన్ని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు పైడిరాజు, పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.